http://www.agnidharanews.com

# అగ్నిధార

శుక్రవారం 31 జనవరి 2025

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## తెలంగాణ పర్యటనకు రాహుల్

- కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం
- ప్రధానంగా జిహెచ్ఎంసిలో అత్యధిక సీట్లు గెలిచి మేయర్ పీఠాన్ని మరోసారి కాంగ్రెస్ కైవసం చేసుకుంటుంది
- మహాత్మా గాంధీ కలలు కన్నా సమానత్వం కోసం సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్నాం

హైదరాబాద్

ఫిబ్రవరి రెండవ వారంలో జాతీయ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సూర్యపేట జిల్లాలో పర్యటించనున్నట్లు, ఈ సందర్భంగా భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ గౌడ్ తెలిపారు. గాంధీ భవన్ వద్ద మీడియాతో చిట్ చాట్ గా మాట్లాడిన మహేష్ కుమార్ గౌడ్.. పలు కీలక విషయాలను వెల్లడించారు.మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రధానంగా జిహెచ్ఎంసిలో అత్యధిక సీట్లు గెలిచి మేయర్ - మిగతా3లో

## ట్యాంక్ బండ్ చుట్టూ
# స్కైవాక్

- రాష్ట్రం మొత్తం పర్యాటక వలయం
- రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- ఫిబ్రవరి 10లోగా పర్యాటక విధానాన్ని సిద్ధం చేయాలని స్పష్టీకరణ
- పర్యాటకరంగం నుంచి వచ్చే ఆదాయం పెరిగితేనే తెలంగాణ ఆర్థిక వ్యవస్థ మరో దశకు చేరుకుంటుంది
- ఎకో టూరిజానికి అవసరమైన ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేసేలా ప్రణాళికలు
- ఆదిలాబాద్, వరంగల్, నాగార్జున సాగర్ వంటి ప్రాంతాల్లో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు



హైదరాబాద్

తెలంగాణలో ఉన్న సమగ్ర పర్యాటక విధానాన్ని ఫిబ్రవరి 10లోగా సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రదేశాలు, అభయారణ్యాలు, ఆలయాలను రాష్ట్రానికి ఆదాయం, గుర్తింపు వచ్చేలా రూపొందించాలని పేర్కొన్నారు. ఎకో టూరిజానికి అవసరమైన ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేసేలా ప్రణాళికలు ఉండాలన్నారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలను సింగపూర్ తరహా విధానాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. సీఎం తన నివాసంలో పర్యాటకశాఖపై సమీక్ష నిర్వహించారు. సింగపూర్ వంటి దేశాలు తక్కువ ప్రదేశంలో వైవిధ్యమైన ప్రణాళికతో పెద్ద సంఖ్యలో పర్యాటకులను ఆకర్షిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాయి. ఇదే - మిగతా3లో



## బడ్జెట్‌కు అంతా రెడీ!

- రేపు పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న మంత్రి నిర్మల సీతారామన్
- మధ్యతరగతిపై ధరలభారాన్ని తగ్గించి, వినిమయాన్ని పెంచేందుకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కసరత్తు
- వార్షికాదాయం 15 నుంచి 20 లక్షల రూపాయలు ఉన్నవారికి 25 శాతం ట్యాక్స్ విధించే యోచన
- ఈ పరిమితిని 10 లక్షల రూపాయల పెంచే సాధ్యాసాధ్యాలను లెక్కలమంత్రి అన్వేషణ
- సంవత్సరంలో అడుగుపెట్టిన తర్వాత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం



## చట్టానికి ఎవరూ అతీతులు కారు

- మహిళా ఐపీఎస్ దంపతుల కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు..!
- ఇరుపక్షాలు కూర్చొని చర్చల ద్వారా వివాదాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నించాలి
- ఇద్దరు కోర్టు సమయాన్ని వృథా చేసే బదులు ఇద్దరూ కూర్చొని వివాదానికి ముగింపు పలకాలని సూచన
- ఎవరైనా బాధితులుగా మారితే.. వారిని రక్షించేందుకు తాము ఉన్నాం



## రాష్ట్రంలో భయంకరమైన
# రోజులు వచ్చాయి

- కాంగ్రెస్ దుష్పరిపాలనతో తెలంగాణ వందేళ్ల వెనక్కి
- కాంగ్రెస్ చరిత్ర మొత్తం మోసాల చరిత్ర, దగా చరిత్ర
- అబద్దాలతో సీఎం రేవంత్ రెడ్డి కాలం వెళ్లదీస్తున్నారు
- 130 ఏళ్ల చరిత్ర ఉన్నదని చెప్పుకునే పార్టీ ప్రజలను ఎలా మోసం చేస్తుంది ?
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్

కాంగ్రెస్ పాలనతో రాష్ట్రంలో భయంకరమైన రోజులు వచ్చాయని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ దుష్పరిపాలన వల్ల తెలంగాణ వందేళ్లు వెనక్కివెళ్లి పరిస్థితి తలెత్తిందని చెప్పారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, అబద్దాలతో సీఎం రేవంత్ రెడ్డి కాలం వెళ్లదీస్తున్నారని విరుచుకుపడ్డారు. అబద్ధం అద్దం ముందు నలబడితే రేవంత్ రెడ్డి బొమ్మ - మిగతా3లో

## కమలం...
# అదిరిపోయే వ్యూహం

- ప్రజల్లోకి వెళ్లేందుకు బీజేపీ ప్రయత్నాలు
- రాష్ట్రంలో రోజు రోజుకీ బలం పెంచుకుంటోంది
- త్వరలో జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలనే గెలివాలనే లక్ష్యంతో ముందుకెళ్తోంది
- త్వరలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి
- ఈ స్థానాలకు కైవసం చేసుకునేందకు పార్టీ నాయకులను, కార్యకర్తలను సిద్ధం చేస్తోంది

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తుంది. రాష్ట్రంలో రోజు రోజుకీ బలం పెంచుకుంటోంది. 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 40 స్థానాలు గెలుచుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన చెప్పుకోదగ్గ స్థానాలు దక్కలేదు. ఆ ఎన్నికల్లో బీజేపీ 8 స్థానాలతో సరిపెట్టుకుంది. అయితే తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్కసారిగా పార్టీ పుంజుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఐదు నుంచి ఆరు స్థానాలతో గెలిచే అవకావముంటుందని చాలా మంది రాజకీయ విశ్లేషకులు భావించారు. అయితే బీజేపీ ఎనిమిది స్థానాలు సాధించి ప్రజలు మద్దతు తమ వైపు ఉందని ప్రూఫ్ చేసుకుంది ఈ ఎన్నికల్లో బీజీపీ, కాంగ్రెస్‌కు చెరో ఎనిమిది ఎంపీ సీట్లు గెలుచుకున్నాయి.అయితే అప్పటి నుంచి బీజేపీ ప్రజల్లోకి వెళ్లేందుకు గట్టిగా ప్రయత్నిస్తోంది. ఇతర పార్టీల కార్యకర్తలను పెద్ద ఎత్తున బీజేపీలో చేర్చుకుంటుంది. త్వరలో జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక - మిగతా3లో






## ఢిల్లీలోని పంజాబ్ సీఎం ఇంట్లో సోదాల కోసం పోలీసులు వచ్చారు

- ఎక్స్ వేదికగా ఆరోపణలు చేసిన అతిషి
- బీజేపీ చేసిన తప్పులను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శ
- అతిషి ఆరోపణలను తోసిపుచ్చిన ఎన్నికల సంఘం

## మహాకుంభమేళలో అగ్ని ప్రమాదం

- మహాకుంభమేళాలో అగ్ని ప్రమాదం జరగడం ఇది రెండోసారి.
- జనవరి 19న తొలి అగ్నిప్రమాదం
- ప్రయాగ్‌రాజ్‌లో తొక్కిసలాట జరిగిన మరుసటి రోజే భారీ అగ్నిప్రమాదం
- మొత్తంగా మహాకుంభమేళా ప్రారంభమైన నాటి నుంచి మూడు అవాంఛనీయ ఘటనలు



# మహాకుంభమేళలో అగ్ని ప్రమాదం



**లక్నో :** ప్రయాగ్‌రాజ్ నుంచి బ్రేకింగ్ న్యూస్. మహాకుంభమేళా ప్రాంతంలోని సెక్టార్-22లో మంటలు చెలరేగాయి. అనేక టెంట్‌లు దగ్ధమవుతున్నాయి. అగ్నిమాపక దళం సంఘటనా స్థలానికి చేరుకుంది. మంటలను అదుపు చేసేందుకు యత్నాలు కొనసాగుతున్నాయి. మంటలు చెలరేగిన స్థలంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరిగినట్లు సమాచారం లేదు. సీనియర్ అధికారులు కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే, అగ్ని ప్రమాదానికి కారణమేమిటి? అన్నది ఇంకా క్లియర్‌గా తెలియలేదు. జనవరి 19వ తేదీ కూడా గ్యాస్ సిలిండర్స్ పేలి కుంభమేళాలో అగ్ని ప్రమాదం జరిగింది.మౌని అమావాస్య సందర్భంగా బుధవారం తెల్లవారుజామున తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. ఇందులో 30 మంది మరణించినట్లు యూపీ ప్రభుత్వం ప్రకటించింది. పలువురు భక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. కుంభమేళాలో తొక్కిసలాటపై ప్రస్తుతం విచారణ జరుగుతుండగా.. యూపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్య ఘాట్‌ల దగ్గర రద్దీ తగ్గించేందుకు ఐదు కీలక మార్పులు చేశారు సీఎం యోగి. కుంభమేళా జరుగుతున్న ప్రాంతాన్ని ఫిబ్రవరి 4 వరకు 'నో వెహికల్' జోన్‌గా ప్రకటించారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేందుకు రోడ్లను వన్ వేగా మార్చారు. వీవీఐపీ పాస్‌లను రద్దు చేశారు. స్పెషల్ పాస్‌లు ఉన్నప్పటికీ అనుమతించడంలేదు.. ప్రయాగ్‌రాజ్ చుట్టుపక్కల జిల్లాల నుంచి వస్తున్న వాహనాలను సరిహద్దుల్లోనే నిలిపివేశారు. రోడ్డుపై విక్రయించుకునే చిరు వ్యాపారులను ఖాళీ ప్రదేశాల్లోకి తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలని సీఎం యోగి ఆదేశించారు. కుంభమేళాకు వచ్చే వారిని అడ్డుకోవద్దని కోరారు. పోలీసులు పెట్రోలింగ్‌ను పెంచాలని, కుంభమేళా నుంచి భక్తులు తిరిగి వెళ్లే మార్గాలలో అడ్డంకులు లేకుండా చూడాలని ఆదేశించారు. కుంభమేళాకు వచ్చిన భక్తులు వారణాసి, అయోధ్య, చిత్రకూట్, మిర్జాపూర్‌లను కూడా సందర్శిస్తుండటంతో ఆయా ప్రాంతాల్లోనూ నిఘా పెంచాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ఢిల్లీలో యమునానదే ఎన్నికల అంశం



**న్యూఢిల్లీ :** ఢిల్లీలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. గత రెండు పర్యాయాలు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ విజయం సాధించింది. ఇదే ఊపులో పంజాబ్ లోనూ గెలుపును సొంతం చేసుకుంది. ఐతే ఇప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ త్వరలో జరిగే ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ సాధించాలని భావిస్తున్నది. ఈ క్రమంలోనే ఎన్నికల ప్రచారంలో దూకుడు మొదలుపెట్టింది. సాధారణంగా ఎన్నికల ప్రచారంలో హుందాగా మాట్లాడతాడని పేరుపొందిన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఈసారి ఎందుకో లైన్ తప్పినట్టు కనిపిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో తన పార్టీ చేసిన అభివృద్ధిని చెప్పుకోలేక.. పక్క రాష్ట్రమైన హర్యానాపై తీవ్రమైన విమర్శలు చేశారు.. హర్యానాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సంచలన విజయం సాధించింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ కొనసాగుతున్నారు. అయితే హర్యానా నుంచి ఢిల్లీకి ప్రవహించే యమునా నదిలో హర్యానా ప్రభుత్వం ప్రమాదకరమైన కలుషితాలను కలుపుతోందని అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. దీంతో ఒకసారి గా రాజకీయంగా దుమారం చెలరేగింది. అరవింద్ ఆస్థాయిలో ఆరోపణలు చేయడంతో.. దానిని తిప్పి కొట్టడానికి హర్యానా ముఖ్య మంత్రి నాయబ్ సింగ్ రంగంలోకి దిగారు. వెంటనే యమునా నదిలోకి దిగి నీటిని తాగి.. కేజ్రీవాల్ కు షాక్ ఇచ్చారు. " యమునా నదిలో విషపూరిత వ్యర్థాలను కలుపుతోందని మా ప్రభుత్వం మీద అరవింద్ కేజ్రీవాల్ ఆరోపణలు చేశారు. నేను ఇప్పుడు ఆ నీటిని తాగాను. ఆరోపణలు చేసిన వ్యక్తి తదుపరిగా ఏం మాట్లాడతారో నేను చూడాలని భావిస్తున్నానని" నాయబ్ సింగ్ వ్యాఖ్యానించారు.యమునా నదిలో హర్యానా ప్రభుత్వం విషపూరిత పదార్థాలు కలుపుతోందని కేజ్రీవాల్ ఆరోపించిన నేపథ్యంలో.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించారు. "అరవింద్ చేసిన ఆరోపణలు దేశానికే అవమానకరం.. హర్యానాలో ఉన్న ప్రజల బంధువులు ఢిల్లీలో నివసిస్తున్నారు. అలాంటిది సొంత ప్రజలు తాగే నీళ్లల్లో విషం ఎందుకు కలుపుతారు. యమునా నదిలో నీటిని న్యాయమూర్తులు, దౌత్యవేత్తలు, పేద ప్రజలు తాగుతున్నారు. ఆ నీటిని నేను కూడా తాగుతున్నాను. అలాంటిది హర్యానా ప్రభుత్వం యమునా నీటిలో విషాన్ని ఎందుకు కలుపుతుందని" ప్రధాని ప్రశ్నించారు. మరోవైపు యమునా నదిలో విష పదార్థాలు కలుపుతోందని హర్యానా ప్రభుత్వంపై అరవింద్ కేజ్రీవాల్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో.. సోనే పాట్ ప్రాంతంలో బిజెపి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు అరవింద్ కేజ్రీవాల్ పై కేసు నమోదు చేశారు. మరి ఇప్పటికైనా ఈ వివాదం ముగుస్తుందో? లేక ఇంకా కొనసాగుతుందో? వేచి చూడాల్సి ఉంది.

# బడ్జెట్‌కు అంతా రెడీ!



**న్యూఢిల్లీ :** ఫిబ్రవరి ఒకటోతేదీన కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు గుడ్‌న్యూస్ వస్తుందా? ఇప్పుడే ఢిల్లీ నుంచి మన గల్లీదాకా ఇదే ఇంట్రస్టింగ్ న్యూస్ ఇదే. మధ్యతరగతిపై ధరలభారాన్ని తగ్గించి, వినిమయాన్ని పెంచేందుకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కసరత్తు చేస్తున్నారు. ఏడాది మీ వేతన సంపాదన 10లక్షల వరకు ఉంటే మీరు ఇన్‌కమ్ ట్యాక్స్ పరిధిలోకి రాకపోవచ్చు. అదే సందర్భంలో వార్షికాదాయం 15 నుంచి 20 లక్షల రూపాయలు ఉన్నవారికి 25 శాతం ట్యాక్స్ విధించే యోచన కూడా చేస్తున్నారు. ఈ రెండు నిర్ణయాలను బడ్జెట్‌లో ప్రకటిస్తే, సర్కారీ ఖజానాపై 50వేల కోట్ల నుంచి నుంచి లక్ష కోట్ల రూపాయల భారం పడుతుందని లెక్కలు కూడా తీశారు. మొత్తానికి కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతారకైతే ఏడాదికి ఏడు లక్షల రూపాయల వరకు ఆదాయం ఉన్నవారు ట్యాక్స్ పరిధిలోకి రారు. ఈ పరిమితిని 10 లక్షల రూపాయల పెంచే సాధ్యాసాధ్యాలను లెక్కలమంత్రి అన్వేషిస్తున్నారు. దేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించనున్నారు. బడ్జెట్ సమయంలో, ప్రజలు స్టాక్ మార్కెట్‌పై కూడా నిఘా ఉంచారు. మన కేంద్రబడ్జెట్.. ఎన్నో ఆశలు.. మరెన్నో అంచనాలు.. ఇంకెన్నో సంకేతాలతో బడ్జెట్ 2025 రాబోతోంది. ఏ రంగానికి ఎంత కేటాయిస్తారో ఇప్పటికే నిపుణులు ఓ అంచనాకొస్తున్నారు. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం చాలా ముఖ్యమైన మార్పుల దిశగా పయనించవచ్చని తెలుస్తోంది. సంవత్సరంలో అడుగుపెట్టిన తర్వాత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఫిక్సైంది. రెండు విడతల్లో ఈ సమావేశాలు జరగనున్నాయి. మొదటి విడత సమావేశాలు జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు కొనసాగనున్నాయి. రెండో విడత సమావేశాలను దాదాపు నెల రోజుల విరామం తర్వాత మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహించనున్నారు.మొదటి విడత సమావేశాల తొలిరోజు జనవరి 31న లోక్‌సభ, రాజ్యసభ ఉమ్మడి సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగిస్తారు. ఇక ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. 2025-26కు సంబంధించి కేంద్ర వార్షిక బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెడతారు. నిర్మల సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం వరుసగా ఇది 8వసారి. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో ఎన్డీయే సర్కారు మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రవేశపెడుతున్న పూర్తి స్థాయి బడ్జెట్ ఇదే కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ బడ్జెట్‌పై కేంద్రం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది.పార్లమెంట్ సెషన్ మధ్యలోనే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు, ఫలితాలు వెలువడనుండటంతో ఈ సమావేశాలపై మరింత ఆసక్తి నెలకొంది. ఫిబ్రవరి 5న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా, బడ్జెట్‌లో ఢిల్లీ కేంద్రంగా ఎలాంటి ప్రకటనలు చేయకూడదని.. ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇక ఈ ఏడాది కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో వాటికి పెద్దపీత వేసే అవకాశం ఉంది. ఈ ఏడాది చివరలో బీహార్ ఎన్నికలు జరగనున్నందున, రెండు మిత్రపక్షాలు జనతాదళ్, లోక్ జనశక్తి పార్టీ రెండూ రాష్ట్రానికి కీలకమైన ప్రకటనల కోసం ఆశిస్తున్నాయి. అలాగే.. బడ్జెట్ పై ఆశలు పెట్టుకున్న వేతన జీవులు, రైతులు, కార్మికులు.. కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెబుతుందని ఎదురుచూస్తున్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్ పరిమితి పరిధిని కూడా కేంద్ర ప్రభుత్వం పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ముఖ్యంగా వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తారన్న చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా రైతుల నుంచి కొన్ని డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఎంఎస్‌పీపై కేంద్రం ఈదఫా బడ్జెట్‌లో తీపికబురు చెబుతుందన్న ఆశతో రైతాంగం ఉంది. ఈసారి కేంద్రబడ్జెట్ రైతుసంక్షేమంగా ఉండొచ్చని విశ్లేషణలు వస్తున్నాయి. ఈనేపథ్యంలో బడ్జెట్ పై ఎన్నో ఆశలు పెట్టుకుంది రైతాంగం. అన్నదాత ఆదాయాన్ని పెంచడంతో పాటు అనేక కీలకాంశాలు బడ్జెట్‌లో ఉండబోతున్నాయని తెలుస్తోంది. జనాభాలో 45 శాతం కంటే ఎక్కువ మంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఇది ఉఆఖకి 15 శాతానికి పైగా మాత్రమే దోహదపడుతుంది. ఇందులో వ్యవసాయ వాటా పెంపునకు సంబంధించిన ప్రధాన ప్రకటనలు వెలువడే అవకాశం ఉంది. ఇటీవల, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా రైతుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇందులో రైతులు తమ డిమాండ్లను ముందుకు తెచ్చారు. ఆర్థిక సర్వే 2023-24 ప్రకారం.. స్థిరమైన ధరల ఆధారంగా భారత వ్యవసాయ రంగం గత ఐదేళ్లలో ఏటా సగటున 4.18 శాతం వృద్ధిని సాధించింది.మరోవైపు దేశంలో రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఎస్‌ఎంపీ కనీస మద్దతు ధరకోసం పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో వేలాదిమంది రైతులు నిత్యం నిరసనలు జరుపుతున్న పరిస్థితి. ప్రభుత్వం కనీస మద్దతు ధరకి చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని రైతులు కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. బడ్జెట్ నేపద్యంలో అందరి దృష్టి ఇప్పుడు ఓూఖపైనే ఉంది. అలాగే రానున్న బడ్జెట్‌పై రైతుల్లో కూడా ఆశలు ఉన్నాయి. తక్కువ వడ్డీకే రుణాలు అందజేయాలని రైతులు కోరుతున్నారు. అంతే కాకుండా పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని రెట్టింపు చేసి పన్నులు తగ్గించాలని కోరుతున్నారు. మార్కెట్ సంస్కరణల ద్వారా రైతుల స్థితిగతులను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలని? కేంద్ర బడ్జెట్‌లో దేశంలోని రైతులు తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతున్నారు.రైతు డిమాండ్లపై కేంద్రం ఇప్పటికే దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. కిసాన్ క్రెడిట్ కార్డ్ రుణ పరిమితికి సంబంధించికూడా గుడ్‌న్యూస్ కేంద్రం చెప్పనుందని టాక్. కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా అందించే రుణ పరిమితిని రూ.5లక్షలకు పెంచే అవకాశం ఉంది., రైతులకు ఆపన్న హస్తంగా ఉంటోంది కిసాన్ క్రెడిట్ కార్డ్ . ఈ కార్డు ద్వారా రైతులకు రుణాన్ని పలు దఫాలుగా ఇస్తారు. ప్రస్తుతం ఈ పరిమితి రూ.3 లక్షలుగా ఉంది. అయితే రాబోయే బడ్జెట్ లో ఈ లిమిట్ ను మరో 2 లక్షలు పెంచి మొత్తం 5 లక్షలుగా నిర్ణయించే ఆలోచనలు చేస్తున్నట్టు సమాచారం. ఇది రైతులకు చాలా ఉపయోగపడనుంది. మరీ ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు ఎంతో సహాయపడుతుంది. దీని ద్వారా గ్రామాల ఆర్థిక వ్యవస్థలోనూ అభివృద్ధి పెరుగుతుంది.వ్యవసాయరంగం అభివృద్ధికి ప్రభుత్వం గత ఏడాది కంటే 15 శాతం అధికంగా రూ.1.75 లక్షల కోట్లు కేటాయించవచ్చని అంచనా. దేశంలో వ్యవసాయోత్పత్తుల సరఫరాను పెంచడంతో పాటు ఎగుమతులపై ఎక్కువ ప్రాధాన్యతను బడ్జెట్ లో ఆలోచించవచ్చు. 2030 నాటికి కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను 50 బిలియన్ డాలర్ల నుంచి 80 బిలియన్ డాలర్లకు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.ఇక వేతనజీవులూ.. మీకోసమే ఈ వార్త. కేంద్ర బడ్జెట్ అనగానే, మనకేమీ ఉండదని రొటీన్‌గా అనుకోకండి. ఏమో గుర్రం ఎగరావచ్చు అనుకోండి. ఎందుకంటే, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ధమాకా న్యూస్ రెడీ చేస్తున్నారు. బడ్జెట్‌కు ముందే హల్వా టేస్ట్.. మనం కూడా చూడొచ్చని ఢిల్లీ నుంచి కథనాలు గుప్పుమంటున్నాయి. వాస్తవానికి ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రవేశపెట్టే బడ్జెట్లలో మధ్యతరగతికి ఇన్‌కమ్‌ట్యాక్స్ విషయంలో పెద్దగా గుడ్‌న్యూస్‌లు ఉండవు. కానీ దేశంలో ప్రస్తుతం ధరలు పెరుగుతున్నాయి.

## ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం.. ఫిబ్రవరి 4 వరకు కుంభమేళాకు బస్సులు రద్దు



**భువనేశ్వర్:** ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. మహా కుంభమేళా కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీసులను ఫిబ్రవరి 4 వరకు రద్దు చేసింది. అనివార్య పరిస్థితుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒక ఉత్తర్వులో పేర్కొంది. మహా కుంభమేళా, అయోధ్యకు వెళ్లే ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీసులను ఫిబ్రవరి 4 వరకు తక్షణమే రద్దు చేస్తున్నట్లు ఒడిశా ఆర్టీసీ తెలిపింది. తాజా అప్‌డేట్‌ను అధికారిక వెబ్‌సైట్, సోషల్ మీడియాలో సమాచారం ఇస్తామని పేర్కొంది. ఈ మేరకు గురువారం ఒక నోటీస్‌ను జారీ చేసింది. అయితే ఫిబ్రవరి 26 వరకు మహా కుంభమేళాకు ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహించాలని గతంలో నిర్ణయించింది. కాగా, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. అయితే మౌని అమావాస్య సందర్భంగా త్రివేణి సంగమం వద్ద తోపులాట జరిగింది. ఈ సంఘటనలో 30 మంది భక్తులు మరణించారు. 60 మందికిపైగా గాయపడ్డారు. పలువురి జాడ కనిపించడంలేదు. అలాగే అగ్నిప్రమాదాలు వంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆ రాష్ట్రం నుంచి భక్తుల రద్దీని తగ్గించేందుకు మహా కుంభమేళాకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసింది.

## ఢిల్లీలోని పంజాబ్ సీఎం ఇంట్లో సోదాల కోసం పోలీసులు వచ్చారు



ఢిల్లీలోని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ సింగ్ నివాసంలో సోదాలు చేసేందుకు పోలీసులు వచ్చారంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. త్వరలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పంజాబ్ ముఖ్యమంత్రి నివాసంలో సోదాల కోసం పోలీసులు రావడం ఆమ్ ఆద్మీ పార్టీ విమర్శలకు దారితీసింది. ముఖ్యమంత్రి నివాసంలో సోదాలు చేసేందుకు పోలీసులు రావడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ చేస్తున్న తప్పులను, ఆ పార్టీ నేతలను మాత్రం పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీజేపీ నేతలు పట్టపగలు డబ్బు, పాదరక్షలు వంటి వస్తువులు పంచుతూ ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్నా పోలీసులు వారిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ప్రజలు ఎన్నుకున్న నాయకుడి ఇంటిపైకి మాత్రం సోదాల కోసం రావడం దారుణమని అన్నారు. అయితే, ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండించింది. పంజాబ్ ముఖ్యమంత్రి నివాసంలో ఎలాంటి సోదాలు నిర్వహించలేదని స్పష్టం చేసింది. ఈ అంశంపై రిటర్నింగ్ అధికారి ఓపీ పాండే మాట్లాడుతూ, అక్కడ నగదు పంపిణీపై ఫిర్యాదు అందిందని తెలిపారు. దీంతో, తాము అక్కడకు వెళ్లి విచారణ చేసి వెనక్కి వచ్చామని తెలిపారు. సీవిజిల్ యాప్ ద్వారా తమకు ఫిర్యాదు అందిందని వెల్లడించారు.

## చట్టానికి ఎవరూ అతీతులు కారు



దేశంలో ఎవరూ చట్టానికి అతీతులు కారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఓ కేసు విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. భార్య భర్తల మధ్య జరిగిన వివాదం కేసు విచారణ సమయంలో సుప్రీంకోర్టు ఇలా స్పందించింది. సదరు వ్యక్తి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సదరు మహిళ ఐపీఎస్ అధికారి కావడంతో తన క్లయింట్ కావడంతో ఎప్పుడూ ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని కోర్టుకు తెలిపారు. దాంతో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్ బెంచ్ స్పందిస్తూ.. 'దేశంలో ఎవరూ చట్టానికి అతీతులు కారు' అని పేర్కొంది. ఇరుపక్షాలు కూర్చొని చర్చల ద్వారా వివాదాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నించాలని సూచించింది. సదరు వ్యక్తి వ్యాపారవేత్త అని.. సదరు వ్యక్తి వ్యాపారవేత్త అని, ఆమె ఐపీఎస్ అధికారిని అని పేర్కొన్న కోర్టు.. ఇద్దరు కోర్టు సమయాన్ని వృథా చేసే బదులు ఇద్దరూ కూర్చొని వివాదానికి ముగింపు పలకాలని సూచించింది. ఎవరైనా బాధితులుగా మారితే.. వారిని రక్షించేందుకు తాము ఉన్నామని తెలిపింది. సదరు వ్యాపారవేత్త తరపున న్యాయవాది మాట్లాడుతూ తన క్లయింట్‌తో పాటు తండ్రిపై ఐపీఎల్ మహిళా అధికారి కేసు దాఖలు చేసిందని.. దాంతో ఇద్దరూ జైలు పాలయ్యారని తెలిపారు. జూన్, 2022లో అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వుల్లో ఆ వ్యక్తి తల్లిదండ్రులపై నమోదైన క్రిమినల్ కేసును త్వరగా ముగించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా ఐపీఎస్ అధికారి సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. విచారణ సందర్భంగా ఐపీఎస్ అధికారి పోలీస్ సర్వీస్‌లో చేరిన సమయంలో తనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని తప్పుడు సమాచారం అందించారని.. ఆ సమయంలో మహిళా అధికారిపై రెండు కేసులు నమోదైనట్లుగా డిఫెన్స్ న్యాయవాది ఆరోపించారు. దీనిపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. 'మీ ప్రాణాలను కాపాడుకోవడం కోసం కంటే మహిళా అధికారి తన ఉద్యోగాన్ని ఎలా కోల్పోతారనే దానిపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్లుగా కనిపిస్తోంది. కానీ, మహిళా అధికారి జీవితాన్ని నాశనం చేసే క్రమంలో మీ సొంత జీవితం కూడా నాశనం అవుతుంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మహిళా అధికారి ఏదైనా తప్పు చేసి ఉంటే హోం మంత్రిత్వశాఖ చర్యలు తీసుకుంటుందని ధర్మాసనం పేర్కొంది. కేసు విచారణను రెండువారాలకు వాయిదా వేసింది.

## డొనాల్డ్ ట్రంప్ కాల్స్

**న్యూఢిల్లీ :** అగ్రరాజ్యాం అమెరికా అధ్యక్షుడిగా జనవరి 20న ప్రమాణం చేసిన డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని నరేంద్రమోదీ జనవరి 27న ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని మోదీ స్వయంగా ఎక్స్‌లో షేర్ చేసుకున్నారు. ఇప్పుడు వైట్‌హౌస్ కూడా కీలక ప్రకటన చేసింది.అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించిన రిపబ్లిక్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్.. 47వ అధ్యక్షుడిగా జనవరి 20న ప్రమాణం చేశారు. ఆయన బాధ్యతలు చేపట్టిన వెంటనే కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జన్మతః పౌరసత్వం రద్దు చేశారు. అక్రమంగా అమెరికాలో ఉంటున్నవారిని స్వదేశాలకు పంపిస్తున్నారు. ఇక అనేక నిర్ణయాలతో దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఐరన్ డోమ్ నిర్మాణానికి కూడా ప్రతిపాదన చేశారు. ఈ క్రమంలో వారం తర్వాత అమెరికా కొత్త అధ్యక్షుడికి భారత ప్రధాని నరేంద్రమోదీఫోన్ చేశారు. కీలక అంశాలపై చర్చలు జరిపారు. ట్రంప్ 2.0 అడ్మినిస్ట్రేషన్‌లో అమెరికా?భారత్ సంబంధాలు మరింత బలపడతాయని మోదీ ఆకాంక్షించారు. రెండోసారి యూఎస్ అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ శ్రేయస్సు, శాంతితోపాటు భద్రత కోసం కృషి చేస్తామని చెప్పారు.

# కమలం... అదిరిపోయే వ్యూహం

-మొదటిపేజీ తరువాయి

స్థానాలనే గెలివాలనే లక్ష్యంతో ముందుకెళ్తోంది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ల సారధ్యంలో బీజేపీ నేతలు జనాల్లోకి పార్టీ తీసుకెళ్లేందుకు శ్రమిస్తున్నారు. త్వరలో జరగబోయే శాసనమండలి, గ్రామ పంచాయతీ ఎన్నికలనే లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్తున్నారుశాసనమండలిలో బలం పెంచుకునేలా బీజేపీ ప్రణాళికలు రచిస్తోంది. త్వరలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాలకు కైవసం చేసుకునేందకు పార్టీ నాయకులను, కార్యకర్తలను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఒక గ్రాడ్యుయేట్, రెండు టీచర్ సెగ్మెంట్లకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించన విషయం తెలిసిందే. అధికారంలో ఉన్న రేవంత్ సర్కార్, ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకిత ఉందనే ప్రచారాన్ని మొదలుపెట్టింది. మంచి అవకాశాన్ని వదులుకోవద్దని పార్టీ కార్యకర్తలు, నాయకులతో చెప్పుకొస్తుంది.మూడు చోట్ల అభ్యర్థులను గెలిపించేలా శాయశక్తులా కష్ట పడాలని అధిష్టానం కోరుతున్నది. అంతే కాకుండా వారం రోజుల్లో ప్రచార కమిటీలు, అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా బాధ్యులను నియమించుకునేందకు కసరత్తు కూడా ప్రారంభించనుంది. కాగా.. పార్టీ తరఫున ఇప్పటికే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నల్గొండ- వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పులి నరోత్తం రెడ్డి, కరీంనగర్- నిజామాబాద్ ? ఆదిలాబాద్- మెదక్ టీచర్ సెగ్మెంట్ కు ముల్క కొమురయ్య పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే.



అభ్యర్థులంతా తమ నియోజకవర్గాల పరిధిలో ప్రచారం మొదలుపెట్టేందుకు సిద్ధమయ్యారు.

ఇప్పటికే.. టీచర్లు, గ్రాడ్యుయేట్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.ఇప్పటికే బీజేపీ అభ్యర్థుల విజయం కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ఇప్పటికే పలు సార్లు బీజేపీ సమావేశాలు నిర్వహిస్తుంది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్లతో సమావేశించింది. బండి సంజయ్, రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేదంర్, కాసం వెంకటేశ్వర్లు, మనోహర్ రెడ్డి, గరికపాటి మోహన్ రావు, పొంగులేటి సుధాకర్ రెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్, పాల్వాయి హరీష్ బాబు, రామారావు పటేల్, తదితర కీలక నాయకులతో సమావేశం నిర్వహించింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు చోట్ల అభ్యర్థులను గెలిపించాలనే లక్ష్యంతో బీజేపీ ముందుకెళ్తోంది.

# సంజయ్ టార్గెట్ గద్దరా... ఈటెలా?

**హైదరాబాద్ :** తెలంగాణ గట్టుపై ఇంట్రెస్టింగ్ పాలిటిక్స్ నడుస్తున్నాయి. ఏడాది కాలంగా నడుస్తోన్న ట్రయాంగిల్ పొలిటికల్ ఫైట్‌లో భాగంగా ప్రతీ టాపిక్‌ను టాక్ ఆఫ్ ది స్టేట్‌గా మార్చేస్తున్నారు నేతలు. ఇప్పుడు లేటెస్ట్‌గా గద్దర్‌కు పద్మ అవార్డుపై నైజాం గడ్డ మీద హైవోల్టేజ్ పొలిటికల్ హీట్ కొనసాగుతోంది. గద్దర్‌కు ఎందుకు పద్మ అవార్డు ఇవ్వరంటూ కేంద్రాన్ని..సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తే..సెంట్రల్ మినిస్టర్ బండిసంజయ్ సీన్‌లోకి ఎంట్రీ ఇచ్చి తూటా పేల్చేశారు. గద్దర్‌కు అవార్డు ఎలా ఇస్తాం..ఆయన మావోయిస్ట్ భావజాలం ఉన్న వ్యక్తి, ఎంతోమంది చావులకు కారణమయ్యాడు అంటూ బాంబ్ పేల్చారు. బరాబర్ నక్సలైట్ భావజాలం ఉన్న గద్దర్‌కు అవార్డు ఇచ్చేదే లేదంటూ తేల్చి చెప్పారు. దీంతో గద్దర్ సెంట్రిక్‌గా బండి సంజయ్ కామెంట్స్ బేస్‌గా తెలంగాణ రాజకీయం రసవత్తరంగా మారుతోంది.గద్దర్‌కు పద్మ అవార్డులపై బండి సంజయ్ వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా కంటిన్యూ అవుతున్నాయి. సీఎం రేవంత్‌కు కౌంటర్ ఇవ్వాలనే ఉద్దేశంతోనే సంజయ్ మాట్లాడారా లేదా ఏదైనా వ్యూహం ఉందా అన్న డౌట్స్ వ్యక్తం అవుతున్నాయి. నక్సలైట్ భావజాలం ఉన్న గద్దర్‌కు పద్మ అవార్డు ఇవ్వబోమన్న సంజయ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ అస్త్రంగా మలుచుకుంటోంది.గద్దర్‌కు అవార్డు ఇవ్వరు కానీ..వామపక్ష భావజాలం ఉన్న ఈటలకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ ఇస్తారు..పైగా బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఈటల రాజేందర్ పేరును పరిశీలిస్తారా అంటూ ..హస్తం పార్టీల నేతలు గళమెత్తుతున్నారు. దీంతో గద్దర్‌కు పద్మ అవార్డు ఇష్యూ ఏమో గానీ..అటు ఇటు తిరిగి ఈటలకు బాణం ఎక్కుపెట్టినట్లైందన్న టాక్ వినిపిస్తోంది. రేవంత్ రెడ్డికి వ్యాఖ్యలకు సమాధానంగా బండి సంజయ్ మాట్లాడిన మాటలు..బీజేపీలోని ముఖ్యనేతకు తాకాయన్న చర్చ జరుగుతోంది.బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక కసరత్తు క్లైమాక్స్‌కు చేరింది. స్టేట్ ప్రెసిడెంట్‌గా ఈటల రాజేందర్ పేరు దాదాపుగా కన్ఫామ్ అయిందన్న టాక్ కూడా వినిపిస్తోంది. సరిగ్గా ఇదే టైమ్‌లో సంజయ్ చేసిన వ్యాఖ్యలు ఈటలకు గుచ్చుకుంటున్నాయట. అనుకోకుండానో..లేక గద్దర్‌కు



అవార్డు ఇవ్వబోమని చెప్పే ఫ్లోలోనో..నకలైట్ భావజాలం అని బండిసంజయ్ ప్రస్తావించడం ఈటలకు హెడెక్‌గా మారిందట. ఈటల రాష్ట్ర అధ్యక్షుడు కావడానికి ముందు నుంచి వస్తున్న అడ్డంకి ఆయన రాజకీయ నేపథ్యమే. అదే వామపక్ష భావజాలం.రాజకీయాల్లోకి వచ్చే కంటే ముందు ఈటల, ఆయన భార్య జమున ఖఆూజలో పనిచేశారని చెప్తుంటారు. దీన్నే సాకుగా చూపి ఈటలకు రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు దక్కకుండా ఆర్ఎస్ఎస్ బ్యాగ్రౌండ్ ఉన్న నేతలు అడ్డుకుంటున్నారన్న ప్రచారం జరుగుతూ వస్తోంది. ఇదే టైమ్‌లో సంజయ్ పేల్చిన బాంబ్ ఇంటా..బయట పొగ లేపుతోందట. కాంగ్రెస్ ఈటల నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ బీజేపీని, సంజయ్‌ని ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తుంటే..బండిసంజయ్ కాంగ్రెస్‌కు కౌంటర్ ఇచ్చే క్రమంలో..ఈటలకు బాణం ఎక్కుపెట్టారన్న టాక్ వినిపిస్తోంది.సంజయ్ అనుకున్న లక్ష్యం నెరవేరిందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఇప్పటివరకు సంజయ్ హిందువుల ఓటు బ్యాంక్ పోలరైజేషన్‌పైనే మాట్లాడుతూ వచ్చారు. ఇప్పుడు గద్దర్ విషయంలో చేసిన వ్యాఖ్యలు నక్సల్స్‌ను వ్యతిరేకించేవారిని తమవైపునకు తిప్పకునేలా ఉన్నాయని అంటున్నారు. చాలామంది కాంగ్రెస్ నేతల తండ్రులను నక్సల్స్ చంపారని చెబుతున్నారు.మంత్రి శ్రీధర్‌బాబు తండ్రి శ్రీపాదరావు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి, ఆనాటి కాంగ్రెస్ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి లాంటి నేతలు నక్సలైట్ల కాల్పుల్లో చనిపోయిన విషయం మర్చిపోవద్దంటున్నారు బీజేపీ నేతలు. కాంగ్రెస్ నేతలే కాదు..చాలా మంది అమాయకులు, హిందుత్వ భావజాలం ఉన్న వ్యక్తుల చావులకు కారణమైన..నక్సల్ భావజాలం ఉన్న గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు.సంజయ్ వ్యాఖ్యల వెనుక ఉన్న మర్మం ఏంటన్న దానిపై గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈటల రాజేందర్ రాష్ట్ర అధ్యక్షుడు అవ్వడాన్ని ఓ వర్గం బీజేపీ నేతలు అడ్డుకుంటున్నారన్నది ఓపెన్ సీక్రెట్. ఆ నేతలకు ఇప్పుడు కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలు అస్త్రంగా మారాయి. వామపక్ష ఐడియాలజీ ఉన్న ఈటల రాజేందర్‌కు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు ఎలా ఇస్తారని పార్టీలో ఇంటర్నల్‌గా వాయిస్ వినిపిస్తున్న బీజేపీ నేతలకు, కాంగ్రెస్ నేతల టోన్ కూడా యాడ్ అవుతుందన్న చర్చ నడుస్తోంది.అయితే తాను చేసిన వ్యాఖ్యలు ఈటలకు తాకేలా ఉన్నాయన్న చర్చ నేపథ్యంలో బండిసంజయ్ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. గద్దర్ నక్సలైట్‌గా పనిచేశారని..ఈటలది వామపక్ష భావజాలమని.. అవి రెండు వేర్వేరు అని చెప్పుకొస్తున్నారు సంజయ్. ఈటల రాజేందర్ మావోయిస్టు కాదని..కమ్యూనిస్టు భావజాలం వేరు..మావోయిస్టుగా చేయడం వేరని క్లారిటీ ఇస్తున్నారు.ఏది ఏమైనా సంజయ్ చేసిన వ్యాఖ్యలు ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా ఉన్నాయని పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది. గద్దర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు అటు రేవంత్ రెడ్డికి నేరుగా కౌంటర్ ఇవ్వగా ఇన్ డైరెక్ట్‌గా సొంత పార్టీలో అధ్యక్ష పదవి ఆశిస్తున్న ఈటలకు కూడా తాకాయని అంటున్నారు. అంతేకాదు గద్దర్‌కు అవార్డు ఇవ్వబోమని చెప్పి..నక్సలైట్ల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన కాంగ్రెస్ నేతల కుటుంబాల మనసు గెలుచుకున్నారని అని కూడా చర్చించుకుంటున్నారు. సంజయ్ కామెంట్స్‌పై మాత్రం గద్దర్ అభిమానులు, వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. బండి వ్యాఖ్యలకు సపోర్ట్ చేసే వారు కూడా ఉన్నారు. అయితే గద్దర్‌కు పద్మ అవార్డు ఇష్యూ ఇంకా ఎటువైపు టర్న్ తీసుకుంటుందో..ఎన్నాళ్లో పొలిటికల్ హాట్ టాపిక్‌గా కొనసాగుతుందో చూడాలి మరి.

# కోమటిరెడ్డి ఫ్రస్టేషన్ బుగ్గకారు కోసమేనా

**నల్గొండ :** కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. ఆయనేం మాట్లాడినా ఆయన మాటలకు అర్థాలే వేరు అన్నట్లుగా ఉంటుంది సీన్. అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న రాజగోపాల్‌రెడ్డి.. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీ రాగం పాడుతున్నారు. పైగా సొంత ప్రభుత్వంపై సెటైర్లు వేస్తున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగుండే అని ప్రజలు అంటున్నారని మెచ్చుకుంటున్నారు. ప్రభుత్వ పథకాలకు పెట్టిన రూల్స్‌పై ఓపెన్‌గానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సదరు ఎమ్మెల్యే అసమ్మతి రాగం వెనుక ఆంతర్యం ఏంటన్నదే ఇప్పుడు రాజకీయవర్గాల్లో ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మంత్రివర్గంలో చోటు కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్న ఈ ఎమ్మెల్యే..ఎంతకీ క్యాబినెట్ ఎక్స్‌ప్యాన్షన్ కాకపోవడంతో ఫ్రస్టేషన్‌లోనే అలా మాట్లాడి ఉంటారులే అని కాంగ్రెస్ నేతలు గుసగుసలు పెట్టుకుంటున్నారు.వ్యాఖ్యలు, ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేస్తూ పొలిటికల్ అట్రాక్షన్‌గా నిలిచే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈసారి ఏకంగా అధికారిక కార్యక్రమంలో, అందులోనూ ప్రజల సమక్షంలో బహిరంగంగానే సొంత ప్రభుత్వంపై సున్నతంగా విమర్శలు చేశారు. సంక్షేమ పథకాలు ప్రారంభించిన నేపథ్యంలో తన నియోజకవర్గంలోని చౌటుప్పల్ మండలం మసీదు గూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క పథకానికి కూడా సరిగ్గా న్యాయం చేయలేకపోతున్నామని చెప్పుకొచ్చారు. అందుకే గ్రామాల్లో ప్రజలు తమ ప్రభుత్వాన్ని తిడుతున్నారని, కేసీఆర్ ప్రభుత్వమే బాగుండేదంటున్నారని సంచలన కామెంట్స్ చేశారు. గ్రామ సభల్లో కూడా జనాలు అధికారులను నిలదీశారని రాజగోపాల్



రెడ్డి..గుర్తు చేయడం మరింత చర్చనీయాంశమవుతోంది.రైతు బంధును 15వేలకు పెంచి ఇస్తామని..కూడా కొంత దుమ్మి కొట్టామంటూ మరో సెటైర్ వేశారు రాజగోపాల్ రెడ్డి. దానికి కారణం మాత్రం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులంటూ కవరింగ్ చేసే ప్రయత్నం చేశారు. మరోవైపు ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం గురించి, వాటికి పెట్టిన రూల్స్ గురించి కూడా ఎద్దేవా చేస్తూ మాట్లాడారు.రైతు కూలీలకు 12 వేలు ఇచ్చే స్కీమ్ కు రూల్స్ ఎందుకు పెట్టారో అర్థం కావట్లేదన్నారు రాజగోపాల్ రెడ్డి. చాలా మంది తమకు రుణమాఫీ కాలేదని, రైతు బంధు రాలేదని.. ప్రభుత్వాన్ని తిడుతున్నారని చెప్పారు. రుణమాఫీ చేసిన తర్వాత కూడా కేసీఆర్ పాలనే బాగుండే అని మెచ్చుకుంటున్నారని చెప్పుకొచ్చారు.ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత ప్రభుత్వ పథకాలపై సెటైర్లు వేయడం..కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు మెచ్చుకుంటున్నారని చెప్పడం పొలిటికల్ హాట్ టాపిక్ అవుతోంది. కావాలనే అలా మాట్లాడారా? లేదంటే ఫ్లోలో మాట్లాడారో కానీ.. ప్రభుత్వ పథకాల పేర్లు కూడా అధికారులను అడిగి పలకటం, వివరాలు కూడా పదే పదే అడగటం, ప్రభుత్వ పెట్టిన నిబంధనలను వ్యతిరేకించటం ఆసక్తికరంగా మారింది. మంత్రి వర్గంలో చోటు కోసం ఎదురుచూస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి..కాంగ్రెస్ అధిష్టానం ఆ ఊసే ఎత్తకపోవడంతో ఫ్రస్టేషన్‌లో ఉండి అలా మాట్లాడుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు అవుతుందో..అయినా తనకు స్థానం దక్కుతుందో లేదోనన్న ఆందోళనలో ఉన్నారట ఆయన. అందుకే ప్రభుత్వంపై సెటైర్లు వేస్తూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పరోక్షంగా మెచ్చుకుంటున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.కొన్ని రోజులుగా రేవంత్ రెడ్డి క్యాబినెట్‌లో బెర్త్ కోసం ఎదురుచూస్తున్న కోమటిరెట్టి రాజగోపాల్ రెడ్డి..మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో వాస్తు మార్పులు కూడా చేపట్టారట. వాస్తు దోషం వల్లే తనకు రాజకీయంగా కలిసి రావడం లేదని భావిస్తున్న ఆయన..పండితుల సూచనలతో క్యాంపు ఆఫీస్‌లోని కొంత భాగాన్ని కూల్చేసి.. తన జాతకం, వాస్తు ప్రకారం మళ్లీ నిర్మిస్తున్నారని తెలుస్తోంది.ఇలా అన్ని విధాగులుగా ప్రయత్నిస్తున్నా.. మంత్రివర్గ విస్తరణ జరక్కపోవడం, జరిగినా తనకు అవకాశం వస్తుందో లేదోనన్న ఆందోళనలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పాలనను మెచ్చుకుంటూ, సొంత ప్రభుత్వంపై సెటైర్లు వేస్తున్నారన్న చర్చ రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోంది.

## ట్యాంక్ బండ్ చుట్టూ స్కైవాక్

-మొదటిపేజీ తరువాయి

తరహాలో రాష్ట్రంలోనూ పర్యాటకరంగం నుంచి వచ్చే ఆదాయం పెరిగితేనే తెలంగాణ ఆర్థిక వ్యవస్థ మరో దశకు చేరుకుంటుందని తెలిపారు.

**ట్యాంక్ బండ్ చుట్టూ స్కైవాక్**

హుస్సేన్ సాగర్ పరిసరాల్లోని సంజీవయ్య, ఎన్టీఆర్, ఇందిరా పార్కులను కలుపుతూ ట్యాంక్ బండ్ చుట్టూ స్కైవాక్, పర్యాటక వలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కవ్వాల్, అమ్రాబాద్ పులుల అభయారణ్యాలను సఫారీ టూరిజానికి అనుగుణంగా తీర్చిదిద్దాలి. వరంగల్?లోని మేడారం, రామప్ప దేవాలయం, లక్నవరం చెరువులను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. నాగార్జున సాగర్, శ్రీశైలం బ్యాక్ వాటర్?లో కేరళ తరహా హౌస్?బోట్ ఏర్పాటు చేస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని అన్నారు.

**ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేసేలా**

బౌద్ధ పర్యాటక కేంద్రాల్ని కలుపుతూ సర్క్యూట్‌తో పాటు సమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు దగ్గర్లో ఉన్న పర్యాటక ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. గోదావరి, కృష్ణా పుష్కరాలకు దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షించేలా అభివృద్ధి చేయాలన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, వరంగల్, నాగార్జున సాగర్ వంటి ప్రాంతాల్లో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయలని అధికారులకు తెలిపారు. అనంతగిరితో పాటు ఇతర ప్రాంతాల్లోనూ వసతులు మెరుగుపరచాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, పర్యటక శాఖ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సభర్వాల్ తదితరులు పాల్గొన్నారు.


## రాష్ట్రంలో భయంకరమైన రోజులు వచ్చాయి

-మొదటిపేజీ తరువాయి



కనబడుతుందని ఎద్దేవా చేశారు. ప్రజలను మభ్యపెట్టి ఎక్కువకాలం పరిపాలించలేరని స్పష్టం చేశారు. అలవిగాని హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని విమర్శించారు. గురువారం నాడు నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన ఎమ్మెల్సీ కవిత ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసీ తెలియక హామీలిచ్చామని స్వయంగా అసెంబ్లీ స్పీకర్ అన్నారని గుర్తు చేసన ఎమ్మెల్సీ కవిత... 130 ఏళ్ల చరిత్ర ఉన్నదని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఎలా మోసం చేస్తుందని ప్రశ్నించారు. చేతిలో ఎర్రబుక్కు పట్టికొని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీ తెలంగాణ పరిస్థితులపై ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. గతంలో తెలంగాణను ఆంధ్రలో కలిసి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కూడా అదే ఒరవడిని కొనసాగిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ చరిత్ర మొత్తం మోసాల చరిత్ర, దగా చరిత్ర అని విరుచుకుపడ్డారు.

## తెలంగాణ పర్యటనకు రాహుల్




-మొదటిపేజీ తరువాయి

పీఠాన్ని మరోసారి కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. మహాత్మా గాంధీ కలలు కన్నా సమానత్వం కోసం సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్నామని, కుల గణనను ప్రతిపక్షాలు ఎన్ని విధాలుగా అడ్డుకోవాలని చూసిన పూర్తి చేశామన్నారు.ఫిబ్రవరి 5న కులగనన రిపోర్టు క్యాబినెట్ సబ్ కమిటీ కి అందుతుందని, రిజర్వేషన్ల పెంపుపై క్యాబినెట్ లో చర్చిస్తామని పీసీసీ చీఫ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం దూర దృష్టితో విదేశీ కంపెనీల నుండి పెట్టుబడును సాధించిందని, టిఆర్ఎస్ హయాంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా పడిపోయిన వైనాన్ని రియల్టర్లు గమనించాలని కోరారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలను గాడిలో పెట్టేందుకు కృషి చేస్తుందని, బీఆర్ఎస్ మాదిరిగా హామీలు అమలు చేయకుండా తాము వదిలి వేయలేదన్నారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి సంబంధించి ఇప్పటికే ముగ్గురు అభ్యర్థుల పేర్లతో అధిష్టానానికి నివేదిక ఇచ్చినట్లు, రెండు మూడు రోజుల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటిస్తామని మహేష్ గౌడ్ తెలిపారు. ఫిబ్రవరి రెండవ వారంలో సూర్యాపేట జిల్లాలో భారీ బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుందని, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సభలో పాల్గొంటారని తెలిపారు.ఇక దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి గురించి మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. వైయస్సార్ కు ఉన్నంత అభిమానులు ఎవ్వరికీ లేరని, ఈ విషయం తన వ్యక్తిగత అభిప్రాయం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ అమలు చేస్తే, ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు అబద్ధపు ప్రచారాలు సాగిస్తున్నారన్నారు.

## దిగాలుగా పల్లీ రైతులు

**మహబూబ్ నగర్ :** తిను బండారమైన వస్తువైనా ఏదైనా తయారుచేసిన ఆ వస్తువు డిమాండ్ ను పరిగణలోకి తీసుకుంటూ ధరను నిర్ణయించడం తయారీదారుడి హక్కుగా పరిగణిస్తాం. ఇది నిజం కూడా ఇది అందరూ ఒప్పుకుంటారు. ఒక్క రైతు విషయంలో మాత్రం పండించిన పంటకు వ్యాపారస్తులు ధనం నిర్ణయిస్తారు. మార్కెట్లో తయారుచేసిన వ్యక్తికి హక్కు ఉంది.అవసరం ఉంటే కొనండి... లేదంటే మానేయండి అనే విధంగా వివిధ వ్యాపారాల్లో వ్యాపారస్తులు తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఒక్క రైతు విషయానికి వస్తే మాత్రం మీరు పండించిన పంటకు ధర గింతే ? మీకు ఇష్టమైతే ఇవ్వండి లేదంటే తీసుకుపోండి ? అనే విధంగా వ్యాపారస్తులు రైతులతో వాదిస్తున్న దాఖలాలు లేకపోలేదు. నాలుగు నుంచి ఆరు మాసాలు శ్రమించి పండించిన పంట దిగుబడి అంతంత మాత్రమే ఉండి ధరలు కూడా లేకపోవడంతో వేరుశనగ రైతు కన్నీటి పర్వతమవుతున్నారు. రాత్రి పగలు శ్రమించి పండించిన వేరుశనగకు ఆశించిన మేరకు ధరలు లేకపోవడంతో రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు. పల్లి కొనుగోలు చేయు సమయంలో అధిక ధరకు విక్రయించిన వ్యాపారస్తులు, రైతు విక్రయించినప్పుడు వ్యాపారస్తులు కొనే సమయంలో మాత్రం ధర ఎందుకు లేదని రైతుకు ఎప్పటికీ దొరకని సమాధానంగా ప్రశ్న మిగిలిపోతుంది. మహబూబ్ నగర్ మార్కెట్ యార్డ్ కు చాలా ప్రత్యేకత ఉంది. జిల్లా నలుమూలల నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి అత్యధికంగా పల్లి ఈ మార్కెట్ యార్డ్ కు చేరుకుంటుంది. రోజు దాదాపు 5000 క్వింటాళ్లు పల్లి ప్రస్తుతం వస్తుంది. మంగళవారం మొత్తం 4848 పల్లి మార్కెట్ కు చేరుకుంది.అత్యధిక ధర 6526 రాగ అత్యల్పంగా దాటిన కేవలం అతి తక్కువ పనికి మాత్రమే రూ 3506 ధర రావడం జరిగింది. అత్యధికంగా పెద్ద మొత్తంలో కొనుగోలు చేయుచున్న పల్లికి రూ 3500 నుంచి రూ 5 వేల మధ్య మాత్రమే ధర పలుకుతుంది. తక్కువ స్థాయిలో మాత్రమే రూ 6600 వరకు క్వింటాల్ కు ధర పలుకుతుంది. దీంతో రైతన్న పెట్టుబడి కూడా రావడం లేదని, ఇలా అయితే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పంటను పండిస్తారు... వ్యాపారస్తులు ఎంత చెబితే అంతకు అమ్ముకుంటారు... ఇది మా కర్మ ఇంకా ఏం చేస్తాం అనుకుంటూ వెళ్లిపోతారు.. ఈ దృశ్యాలు, ఆవేదన శ్రమించి పండించిన పంట విక్రయించిన ప్రతిసారి రైతులు కలత చెందుతున్నారు. పల్లి కొనుగోలు చేయుసమయంలో అన్ని విత్తనాలు అందుబాటులో ఉంచిన మాదిరిగానే, పల్లి విత్తనాలు కూడా ప్రభుత్వం అందుబాటులో ఉంచి తక్కువ ధరకు నాణ్యమైన విత్తనాలు అందిస్తే మేలు జరుగుతుందని

# సంపాదకీయం

## భూతలస్వర్గం డొల్లతనం!

ఈ అప్పుల ఫలితంగా అమెరికాలోని ప్రతి పౌరునిపైనా 91 లక్షల రూపాయల అప్పు ఉంది. కొన్ని దశాబ్దాలుగా అమెరికా అప్పులు పెరుగుతూనే ఉన్నాయి. 2000 సంవత్సరం నాటికి 5.7 ట్రిలియన్ డాలర్ల అప్పు ఉండగా, 2024 నాటికి 36 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. ప్రపంచంలోని అనేక దేశాల ఆర్థిక వ్యవస్థల మొత్తం విలువ కన్నా అమెరికా అప్పులే ఎక్కువ. మేడి పండు విప్పిచూస్తే దాని నిండా పురుగులు కన్పిస్తాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ కూడా అలాంటిదే. ఆయుధ బలంతో వెనుకబడిన దేశాల సహజ వనరులను, సంపదలను లూటీ చేయటం ద్వారా దాని ఆర్థిక మనుగడ కొనసాగిస్తున్నది. వెనుకబడిన దేశాలు, ప్రజలు అమెరికా కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తే దాని ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుంది. ఆకాశాన్నంటే భవనాలు, బహుళ జాతి సంస్థలు, మంచి ఉద్యోగాలు, భారీ వేతనాలు, అద్భుతమైన జీవితంగా అమెరికా గురించి మధ్యతరగతి జీవుల ఊహలు. అక్కడి పరిస్థితులు ఈ ఊహలకు భిన్నంగా ఉన్నాయి. అక్కడి పేదరికం, సంపద కేంద్రీకరణ, అప్పులు, ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉద్యోగాల తొలగింపు ఆ దేశ వాస్తవ పరిస్థితులకు అద్దంపడుతూ దాని మేడిపండు స్వభావాన్ని వెల్లడి చేస్తున్నాయి. భూతల స్వర్గంగా ప్రచారం చేయబడుతున్న అమెరికా ఆర్థిక వ్యవస్థ ఇతర దేశాలపై ఆధారపడి కొనసాగుతున్నది. ప్రపంచంలో ఏ దేశంలో లేని సంపద అసమానతలు అమెరికాలో ఉన్నాయి. ఇది 1920 నుండి ఎన్నడూ లేనంత స్థాయిలో నేడు ఉంది. గత 30 సంవత్సరాల్లో అగ్రశ్రేణి 1 శాతం ప్రజల సంపదలో 21 ట్రిలియన్ల (1 ట్రిలియన్ లక్ష కోట్లు) డాలర్లు పెరిగితే, దిగువ సగం మంది ప్రజలు 9 వందల బిలియన్ల డాలర్ల సంపదను కోల్పోయారు. ఐరోపా కన్నా అమెరికాలో ధనిక, పేదల మధ్య అంతరం వేగంగా పెరిగిందని ఇంపీరియల్ కాలేజీ బిజినెస్ స్కూల్లో ఫైనాన్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్, అధ్యయనం ప్రధాన రచయితలలో ఒకరైన డాక్టర్ క్లారా మార్టినెజ్-టోలెనాడో అన్నారు. 1980 నుండి సంపద అంతరం గురించి చూస్తున్నాము. అమెరికాలోని అగ్రశ్రేణి 1% వారి సంపద ఐరోపా కంటే ఎక్కువ పెరిగింది. ఒక మాటలో చెప్పాలంటే అమెరికాలో ధనవంతుల పేదల మధ్య అంతరం చాలా ఎక్కువైంది. అమెరికాలో ధనవంతుల- పేదల మధ్య సంపద అంతరాన్ని తెలియ చేసే మరో అంశం కార్మిక అసమానత. శ్రామికవర్గ వేతనాలు తక్కువగా, శ్రమతో సంబంధం లేని వేతనాలు ఎక్కువగా ఉండటం. 2019 లెక్కల ప్రకారం అమెరికాలో 10.5% మంది పేదలు ఉన్నారు. ది జర్నల్ ఆఫ్ ది అమెరికన్ మెడికల్ అసోషియేషన్ ప్రచురించిన 2023 అధ్యయనం ప్రకారం అమెరికాలో మరణాలకు పేదరికం ప్రధాన కారణంగా ఉంది. ప్రతి సంవత్సరం దాదాపు 3 లక్షల మంది మరణిస్తున్నారు. పేదరికంలో ఉన్న పిల్లలు యుక్త వయస్సులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. అమెరికా ఆహార ధాన్యాలను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నా, ఆ దేశంలో ప్రజలు ఆహార సమస్యను ఎదుర్కొంటున్నారు. 2023లో దాదాపు 13.5% కుటుంబాలు ఆహార అభద్రతలో ఉన్నాయి. 2019లో జరిగిన అధ్యయనంలో గ్రాడ్యుయేట్ లోపు విద్యార్థులలో 40% మంది ఆహార అభద్రతలో ఉన్నారు. కోవిడ్- 19 సమయంలో అమెరికా కుటుంబాలకు ఆహార అభద్రత రెట్టింపు అయ్యింది. ఇది చిన్నపిల్లలు ఉన్న కుటుంబాల్లో అధికంగా ఉంది. 2020 నవంబర్ సేకరించిన హౌస్ హోల్ సర్వే డేటా ప్రకారం 2.6 కోట్ల మంది వయోజనులు (అంటే వయోజన జనాభాలో 12%) వారం రోజులుగా ఆహార కొరతను ఎదుర్కొంటున్నారు. కొన్ని సంస్థలు అభద్రతలో ఉన్న కుటుంబాలకు ఆహారాన్ని అందిస్తున్నాయి అంటే ఏ స్థాయిలో ఆహార సమస్య ఉందో అర్థమవుతుంది. అమెరికాలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. 2023లో నిరుద్యోగ రేటు 3.9% ఉంటే 2024లో 4.1 శాతానికి పెరిగింది. లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉద్యోగుల తొలగింపు స్థిరంగా కొనసాగుతున్నది. 2001 నుండి 2019 వరకు ప్రతి సంవత్సరం 2 కోట్లకు పైగా ఉద్యోగులు తొలగించబడ్డాయి. 2020 మార్చి, ఏప్రిల్ నెలల్లో కోవిడ్ కారణంగా రికార్డు స్థాయిలో తొలగింపులు జరిగాయి. 2024 జనవరి నుండి అక్టోబర్ వరకు కోటి 60 లక్షల, 40 వేల మంది ఉద్యోగుల తొలగింపు జరిగింది. ప్రస్తుతం అమెరికాలో నిరుద్యోగ భృతి ప్రయోజనం పొందుతున్నవారు 18 లక్షల, 70 వేల మంది. 2024 డిసెంబర్ లో కొత్తగా నిరుద్యోగ భృతి కోరుతూ 2 లక్షల, 20 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అమెరికా వ్యవసాయ నివేదిక ప్రకారం 2022తో పోలిస్తే నిత్యావసర వస్తువుల ధరలు 11% పైగా పెరిగాయి. కొన్ని వస్తువుల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. గుడ్డు ధర 4.8%, బీఫ్ మాంసం 3% కంటే ఎక్కువ పెరిగాయని చెబుతున్నారు. అమెరికా కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై 25% టారిఫ్ విధిస్తానంటున్నారు. ఇదే జరిగితే ధరల పెరుగుదల ఇంకా ఎక్కువగా ఉంటుందని ప్రజలు భయపడుతున్నారు. వాటర్ గైడ్స్ చేపట్టిన సర్వేలో నిత్యావసరాల కోసం అవుతున్న ఖర్చులు తమ జీవితాలను తారుమారు చేస్తున్నట్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాల తొలగింపు, కొత్త ఉద్యోగాలు రాకపోవడంతో చేతిలో చిల్లిగవ్వ ఉండటం లేదని, ఆర్థిక ఒత్తిడి వల్ల మానసిక వేదనకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు ఆర్థిక అంశాల ఒత్తిడికి ప్రధాన కారణంగా ఉంది. యువకుల్లో ఈ ఒత్తిడి తీవ్రస్థాయిలో ఉంది.అమెరికా ఆర్థిక వ్యవస్థ ఎంత డొల్లతనమో దాని అప్పులే తెలియజేస్తున్నాయి. తాజా లెక్కల (27 సెప్టెంబర్ 20-24 వరకు) ప్రకారం అమెరికా చేసిన అప్పులు 36 ట్రిలియన్ (36 లక్షల కోట్ల డాలర్లు) డాలర్లు. భారత కరెన్సీలో 3,035 లక్షల కోట్ల రూపాయలు. 2024లోనే 2 లక్షల డాలర్ల అప్పు చేసింది. ఈ అప్పుల ఫలితంగా అమెరికాలోని ప్రతి పౌరునిపైనా 91 లక్షల రూపాయల అప్పు ఉంది. కొన్ని దశాబ్దాలుగా అమెరికా అప్పులు పెరుగుతూనే ఉన్నాయి. 2000 సంవత్సరం నాటికి 5.7 ట్రిలియన్ డాలర్ల అప్పు ఉండగా, 2024 నాటికి 36 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. ప్రపంచంలోని అనేక దేశాల ఆర్థిక వ్యవస్థల మొత్తం విలువ కన్నా అమెరికా అప్పులే ఎక్కువ. మేడి పండు విప్పిచూస్తే దాని నిండా పురుగులు కన్పిస్తాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ కూడా అలాంటిదే. ఆయుధ బలంతో వెనుకబడిన దేశాల సహజ వనరులను, సంపదలను లూటీ చేయటం ద్వారా దాని ఆర్థిక మనుగడ కొనసాగిస్తున్నది. వెనుకబడిన దేశాలు, ప్రజలు అమెరికా కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తే దాని ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుంది. రిపబ్లిక్ పార్టీ లేక డెమొక్రాటిక్ పార్టీ అయినా దేశ గుత్తపెట్టుబడిదారుల, సంపన్న వర్గాల ప్రయోజనాలను కాపాడుతున్నాయి. దాని ఫలితమే అమెరికాలో సంపద వ్యత్యాసాలకు, పేదరికానికి, నిరుద్యోగానికి, అధిక ధరలు, అప్పులకు కారణంగా ఉంది. వీటికి పరిష్కారం అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, ఆ దేశ, వెనుకబడిన దేశాల ప్రజలు ఉద్యమించటమే.

# ఆత్మనిర్భర్ ఎవరి కోసం?




ఇటీవల విశాఖ వచ్చిన, ప్రభుత్వంలో నెంబర్ 2గా వున్న మంత్రి లోకేష్ విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి ప్రశ్నలు వేయడం లేదేమని విలేకర్లను ఎదురు ప్రశ్న వేశారు. కూటమి ప్రభుత్వం ప్యాకేజీతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ నుండి బయట పడేసిందని, ఇక ప్రమాదం లేదని మరోసారి విశాఖ ప్రజలను, ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకాన్ని మోసగించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్లు ప్యాకేజీ ప్రకటించిన వెంటనే ప్రభుత్వ పెద్దలు ఎవరి స్థాయిలో వారు ఇదొక విజయంగా తమ ఖాతాల్లో వేసుకోవడానికి పోటీ పడ్డారు. ఇంత మంచి ప్యాకేజీ అయితే కూటమి ప్రభుత్వం జనవరి 8వ తేదీన ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన వేల మంది ఉత్తరాంధ్ర ప్రజలు పాల్గొన్న బహిరంగ సభలో ఎందుకు ప్రకటించలేదు? దీనినిబట్టి ఆ ప్యాకేజీ అతరార్థం ఏమిటో అర్థమౌతున్నది. మొత్తంగా పరిశీలిస్తే గత నాలుగు సంవత్సరాలుగా స్టీల్‌ప్లాంట్ కార్మికులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రజానీకం సంపూర్ణమైన మద్దతు తెలియజేసింది. ఫలితంగా అన్ని రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉంటామని చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రధాని మోడీ విశాఖ పర్యటన ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు ముఖ్యంగా విశాఖ ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించింది. అదే వేదిక మీద నుండి ముఖ్యమంత్రి విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం కాకుండా అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో సముద్ర తీరానికి దగ్గరగా ఆర్సెల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ వస్తుందని, దీనికి కావలసిన ముడిసరుకు, సొంత గనులు కేటాయించాలని ప్రధాన మంత్రికి ఢిల్లీలో నివేదించామన్నారు. దానికి ప్రధానమంత్రి హామీ కూడా ఇచ్చినట్లు చెప్పారు. ఇంతకంటే ఆంధ్ర రాష్ట్రానికి కావలసింది ఏముందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రధానమంత్రికి ప్రభుత్వ రంగ పరిశ్రమల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో దీన్నిబట్టే అర్థమవుతుంది. ఆర్సెల్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు నక్కపల్లిలో మొదటి విడత 2200 ఎకరాలు, రెండో విడత 2400 ఎకరాలు మొత్తం కలిపి 4600 ఎకరాల ఖరీదైన భూములు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తున్నది. ఇందులో రూ.1 లక్ష 35 వేల 964 కోట్లు పెట్టుబడులు పెడుతున్నట్లు భ్రమలు కల్పిస్తున్నారు. దీనికి ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి గనులు కేటాయించాలని నిర్ణయించారు. ఈ ప్రైవేటు స్టీల్‌ప్లాంట్ నిర్మాణ పనుల్లో సుమారు 25,000 మందికి ఉపాధి వస్తుందని, మొదటి దశలో ఉత్పత్తి ప్రారంభిస్తే 20 వేల మందికి శాశ్వత ఉద్యోగాలు వస్తాయని నమ్మబలుకుతున్నారు. ప్రభుత్వం నుండి భూములను కొల్లగొట్టడానికనేది లోగుట్టుగా వున్నది! ఇప్పటికే విశాఖ పోర్టులో ఈ.క్యూ బెర్తు అదానీ కంపెనీ లీజుకు తీసుకుని బ్యాంకుల్లో తనఖా పెట్టి రూ.350 కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఉదంతం కళ్ల ముందే ఉంది. బెర్తుల్లో పెట్టుబడులు పెట్టామనే పేరుతో ఒకే ఒక వెసల్ వ్యాపారం చేసి రూ. 55 వేల కోట్లు నష్టం వచ్చిందని పోర్టు యాజమాన్యంపై నష్టపరిహారం ఇవ్వాలని అదానీ కోర్టులో దావా వేశారు. గతంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లో బ్రాండిక్స్ గార్మెంట్స్ కంపెనీకి ఎకరా ఒక్క రూపాయి చొప్పున వెయ్యి ఎకరాల భూమిని 33 సంవత్సరాలకు లీజుకిచ్చారు. ఇందులో 60 వేల మందికి ఉపాధి కల్పిస్తామని ఎంఒయు కుదుర్చుకున్నారు. నేటికి 20 సంవత్సరాలైనా 20 వేల మందికి కూడా ఉపాధి కల్పించలేదు. మరిన్ని ప్రభుత్వ రాయితీల కోసం బ్రాండిక్స్ పేరును 'అదిస్తాన్'గా మార్చుకున్నది. భవిష్యత్‌లో 'మిట్టల్' స్టీల్‌ప్లాంట్ కూడా భూములు, ప్రభుత్వ రాయితీలు పొంది ఇదే విధంగా చేయదనే గ్యారంటీ లేదు! విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రారంభమై దాదాపు నాలుగు దశాబ్దాలు అవుతున్నా సొంత గనులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోంది? సొంత గనులు వుంటే విశాఖ స్టీల్‌ప్లాంట్ దేశంలోనే అగ్రగామి కంపెనీగా అభివృద్ధి అయ్యుండేది. ఇప్పుడు పెరిగిన ధరలకు అనుగుణంగా టన్ను ఉక్కు ఉత్పత్తికి రూ. 60 వేలు వ్యయం అవుతుంటే, రూ. 50 వేల ఆదాయమే వచ్చి రూ. 10 వేలు నష్టం వస్తున్నది. సొంత ఐరన్ ఓర్ లేకపోవడంతో స్టీల్ తయారీకి 40 శాతానికి పైగా వ్యయం పెరిగింది. ఐరన్ ఓర్ వ్యయం 17 నుండి 18 శాతం, ఉత్పత్తి వ్యయం 67 నుండి 68 శాతం పెరిగింది. దీనితో పాటు విద్యుత్, నీరు తీసుకున్న అప్పులకు వడ్డీలు అధిక భారం అయ్యాయి. సొంత గనులు వుంటే ఇవన్నీ అధిగమించడానికి అవకాశం వుంటుంది. సొంత గనులున్న ప్రభుత్వ సంస్థ అయిన స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)కు టన్ను ఐరన్ ఓర్ 2022-23 సంవత్సరంలో రూ.4,571 ఖర్చు అవుతుంటే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.9,346 ఖర్చవుతున్నది. దీంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు టన్నుకు రూ.4,775 అదనంగా ఖర్చు చేస్తున్నది. ఇటీవల ఈ ఖర్చు మరింత పెరిగింది. దీనిని పరిశీలిస్తే సొంత గనులు వుంటే ఎంత లాభాలు రావడానికి అవకాశం వుందో అర్థమౌతుంది. అలాగే తన సొంత ఉత్పత్తి పెంచుకోవడానికి, ఉపాధి అవకాశాలు పెరగడానికి, ప్రభుత్వ ఆస్తిని విస్తరించడానికి ఉపయోగపడుతుంది. అలాంటి శాశ్వత పరిష్కారం కోసం ఆలోచించకుండా ప్యాకేజీ ఇచ్చి స్టీల్‌ప్లాంట్‌కు మెరుగులు దిద్ది అమ్మకానికి కుట్రలు చేస్తున్నారనేది తేటతెల్లమౌతుంది. ప్రభుత్వాలున్నది ప్రభుత్వరంగ సంస్థలకు కాపాడడానికా? ప్రైవేట్ పరిశ్రమలను ఉద్ధరించడానికా? అనేది స్పష్టమౌతున్నది. ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలకు ట్రస్టీలుగా వుండి కాపాడాల్సింది పోయి రాజ్యాంగ స్ఫూర్తికే భిన్నంగా ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం పూనుకుంటున్నది. ఆత్మనిర్భర్ భారత్ అంటే ఇదేనా? ప్రైవేట్, కార్పొరేట్ పెట్టుబడిదారులకు రూ. 16 లక్షల కోట్ల రుణాలను రద్దు చేసిన బిజెపి ప్రభుత్వం.. లక్షలాది మందికి ఉపాధినిస్తూ ప్రభుత్వానికి డివిడెంట్లు అందించే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు నిధులు కేటాయించడం లేదు? నేడు ప్రైవేట్ కంపెనీల మీద ఉన్న మోజు ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడంలో లేదు. స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకాలు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటి నుండి దీర్ఘకాలిక పోరాటం జరుగుతోంది. ఆంధ్ర రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవంతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌కు నాడు కేంద్ర ప్రభుత్వం రూ. 5 వేల కోట్లు పెట్టుబడులు పెడితే నేడు రూ. 3 లక్షల కోట్ల స్థాయికి ఎదిగింది. దేశంలో అన్ని స్టీల్‌ప్లాంట్ల కంటే ఉత్పత్తి రికార్డు స్థాయిలో చేసింది. బంగారు బాతుని రక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం బలహీనపరిచే చర్యలకు పూనుకుంటున్నది. ఫలితంగా స్టీల్‌ప్లాంట్ వెంటిలేటర్‌పైకి వెళ్ళింది. కేంద్ర ప్రభుత్వం దీనిని రక్షించాల్సి వుండగా.. అమ్మకాలైనా జరుపుతాం లేదంటే మూసివేయటానికైనా సిద్ధమని స్వయానా ఆర్థికమంత్రి ప్రకటించారు. ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకోకుండా ప్యాకేజీ ప్రకటించారు. ప్రకటించిన ప్యాకేజీ కొంత ఉపశమనం తప్ప శాశ్వత పరిష్కారం కాదు! స్టీల్‌ప్లాంట్ రక్షణకు చిత్తశుద్ధి వుంటే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి వ్యూహాత్మక అమ్మకం నిర్ణయాన్ని ఉపసంహరించుకునేటట్లు ప్రకటన చేయించాలి. సొంత గనులు కేటాయించాలి. సెయిల్‌లో విలీనం చేయించాలి. ఉద్యోగుల స్వచ్ఛంద పదవీ విరమణ (వి.ఆర్.ఎస్) ప్రతిపాదనను విరమించుకోవాలి. ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడినీ తొలగించరాదు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలి. కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లించే చర్యలు చేపట్టాలి. అప్పుడు మాత్రమే స్టీల్‌ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పూర్వ వైభవం సంతరించుకుంటుంది.

# భగ్న ప్రేమికురాలు సురయ్య



ఆమె అందంలో అప్సరస. ఆమెది గంధర్వ గానం. ఒకనాడు హిందీ సినీ చిత్ర సీమను మకుటం లేని మహారాణిగా ఏలింది. నిర్మాతలకు కల్పవృక్ష మైంది. నాటి యువకుల హృదయ సామ్రాణిగా నిలిచింది. అత్యంత పారితోషికం తీసుకునే కథానాయకురాలిగా ఉంటూ, ఒక హీరో ప్రేమను చూరగొని, ప్రేమకు మతాలు అడ్డు గోడలైన కారణంగా సినీ జీవితాన్ని వదులు కోవడం కాకుండా, జీవితాంతం అవివాహిత గా ఉండి పోయింది భగ్న ప్రేమికురాలు. ఆమెనే అలనాటి అందాల తార, గాయని సురయ్య.తెరమీద అభినయించే నటీనటులకు గాయనీ గాయకులు నేపథ్యగానాన్ని అందించే ప్రక్రియ ఇంకా ఆరంభంకాని దశలో అందం, అభినయం, సుమధుర గాత్రంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన ఏకైక విదూషీమణి సురయ్య. నాలుగో దశకంలో బాలీవుడ్‌ను సురయ్య, నూర్జహాన్‌లనే ఇద్దరూ నట గాయనీ మణులు ఏలేవారు. అప్పటికీ నూర్జహాన్ అనే వర్సటైల్ సింగర్ కమ్ యాక్టరెస్ ఉన్నా అందంలో మాత్రం సురయ్యదే పైచేయి. దేశ విభజన తర్వాత నూర్జహాన్ పాకిస్తాన్‌కు వెళ్లిపోగా, సురయ్యకు తిరుగు లేకుండా పోయింది. 1946 నుంచి 1950 వరకు సురయ్య మకుటంలేని మహారాణిలా బాలీవుడ్‌లో చెలామణి అయింది. 1940వ దశకంలో ఆమె హిందీ తెరపై ఒక సూపర్ స్టార్ అనిపించు కోవడమే కాకుండా నాటి యువకులకు ఓ ఆరాధ్య దేవత. రేడియో కార్యక్రమంలో పాడుతుంటే, ఆమె గురించి తెలుసుకుని నాటి ప్రఖ్యాత సంగీత దర్శకుడు నౌషాద్ ఆమెను హిందీ వెండి తెరకు పరిచయం చేశాడట. మీర్జా గాలిబ్' లో ఆమె చౌద్వీన్ పాత్ర పోషించడమే కాకుండా ఆమె పాడిన గాలిబ్ గజళ్ళు విని, చిత్రానికి చూసి నాటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఆమెను "నీవు గాలిబ్ ను పునరుజ్జీవింప చేశావు" అని ప్రశంసించారట. జూన్ 25, 1929లో లాహెూర్ నగరంలో జన్మించిన సురయ్య జమాల్ షేక్ చిన్నప్పుడే ముంబాయిలో ఉంటూ కర్దార్ ఫిలిం కంపెనీలో పని చేస్తున్న తన మేనమామ దగ్గరకు వచ్చిన సందర్భంలో, ఆమె సినిమాల్లోకి రావడం యాదృచ్ఛికంగానే జరిగింది. ఓసారి తన అంకుల్‌తో కలిసి తాజ్‌మహల్ సినిమా షూటింగ్‌కు వచ్చిన సురయ్యకు అనుకోకుండానే అందులో ముంతాజ్ మహల్ పాత్ర దొరికింది. పసితనపు ఛాయలు వీడని ఆమెతో శారద సినిమాలో ఓ పాట పాడించి పెద్ద సాహసమే చేశాడు ప్రఖ్యాత సంగీత దర్శకుడు నౌషాద్. ఆ పాట భారతదేశ మంతటా మారుమోగింది. దాంతో సురయ్య ఓవర్ నైట్ లో స్టార్ అయింది. మధురాతి మధురంగా గానం...అద్భుతమైన నటన..పాలరాతి శిల్పం లాంటి అందమైన సురయ్య, క్రమేణ నిర్మాతల పాలిటి కల్పవృక్షమయ్యిందంటే అతిశయోక్తి కాదు. 1945 నుండి 1961 దాకా అత్యధిక పారితోషికం తీసుకున్న నటి సురయ్య. తర్వాత సురయ్య వరుసగా సినిమాలలో నటించింది. ఫూల్, విద్య, జీత్, దాస్తాన్, సనమ్, అఫ్సర్ వంటి సినిమాలు సురయ్యకు పేరును, నిర్మాతలకు డబ్బును తెచ్చిపెట్టాయి. నటుడు దేవానంద్‌ను సిఫార్సు చేసి, ప్రోత్సాహాన్ని అందించింది. అయన సరసన చాలా చిత్రాలలో నటించి, ఉత్తమ జంటగా గుర్తింపు పొందింది. 1948లో వచ్చిన ప్యార్ కీ జీత్, 1949లో వచ్చిన బడీ బెహన్, దిల్లగీలు బాక్సాఫీసును బద్దలు కొట్టాయి. సొహ్రాబ్ మోదీ దర్శకత్వంలో వచ్చిన మీర్జా గాలిబ్ సినిమా సూపర్ హిటయ్యింది. ఆ సినిమా రెండు జాతీయ అవార్డులను కూడా గెల్చుకుంది. సినిమా చూసిన నాటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సురయ్యను ఎంతగానో అభినందించారు. అలా తిరుగులేని నటిగా, గాయనిగా పేరు ప్రఖ్యాతులు గడించిన సురయ్య 34 ఏళ్ల వయసుకే ప్రేమ వైఫల్యం కారణంగా అర్థాంతరంగా సినిమాల్లోంచి తప్పుకుంది.1946 లో అన్ మోల్ షడీ చిత్రానికి అవార్డు పాటు 1954- మీర్జా గాలిబ్" ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్, 1996- స్క్రీన్ లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డ్, 1998- ప్రధాని వాజ్ పేయ్ చేతుల ద్వారా సన్మానం, సాహిత్య అకాడమీ అవార్డ్ ఫార్ హర్ పార్టిసిపేషన్ ఇన్ మీర్జ గాలిబ్ బిమల్ రాయ్ మెమోరియల్ అవార్డ్- 1999, దాదాసాహెబ్ ఫాల్కే అకాడెమీ అవార్డ్- 2003, బెస్ట్ ఆన్ స్క్రీన్ బ్యూటీ ఇన్ 100 ఇయర్స్ ఆఫ్ ఫిల్మ్ ఇండస్ట్రీ విత్ ఎత్నిక్ లుక్ అవార్డ్ - 2013 (మరణానంతరం) సొంతం చేసుకుంది. 2013 మేలో కేంద్ర ప్రభుత్వం ఆమె పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. నాలుగు పదుల వయస్సు దాటిన తరువాత దేవానంద్ కు నాటి ప్రముఖ గాయని, నటి సురయాతో కలసి నటించే అవకాశం వచ్చింది. అప్పట్లో దేవానంద్ కంటే కూడా సురయ్యకే స్టార్ డమ్ ఎక్కువగా ఉండేది. నిర్మాతలు, దర్శకులు కూడా అలాగే భావించేవారు. కథల్లో కూడా ఆమె పాత్రలకే ప్రాధాన్యం ఉండేది. వారిద్దరూ కలసి పలు చిత్రాల్లో నటించారు. దేవానంద్, సురయ్య 1948 నుంచి 1951 మధ్య ఆరుచిత్రాలలో కలిసి నటించారు. విద్య (1948), జీత్ (1949), షాయిర్ (1949), అఫ్సర్ (1950), నిలి (1950), దో సితారే (1951), సనమ్ (1951) లాంటివి బాక్సాఫీస్ హిట్ అయ్యాయి. విద్య (1948) చిత్రం లోని కినారె కినారె చలె జాయెంగె పాట చిత్రీకరణ సమయంలో పడవ మునిగినప్పుడు, నీటిలో పడి మునిగి పోతున్న సురయ్యను దేవానంద్ రక్షించి ఆమెను ప్రేమించాడు. జీత్ చిత్రం చిత్రీకరణ సమయంలో దేవ్ ఆనంద్ తన ప్రేమ వ్యక్త పరిచాడు. కొన్నాళ్ళ పాటు వారి ప్రేమ వ్యవహారం రహస్యంగానే ఉండింది. అయితే వీరి ప్రేమకు సురయ్య తల్లి సానుకూల మయినా, హిందువయిన దేవానంద్ తో పెళ్లేమిటని సురయ్య అమ్మమ్మ తీవ్రంగా నిరసించింది. దేవ్ ఫోన్ చేస్తే పరుషంగా మాట్లాడి, దేవ్ మనసును గాయ పరిచింది. అయినా దేవ్, దివేచా అనే సినీఛాయా చిత్రకారుడి ద్వారా సురయ్యాకు 3000 రూ.లు ఖరీదు చేసే వజ్రపుటుంగరాన్ని పంపితే సురయ్య మహదానంగా స్వీకరిస్తే, తన కథ సుఖాంతమని భావించాడు దేవ్. చనిపోతామని బెదిరించి, సురయ్య ప్రేమకు ఆమె బంధుగణం అడ్డు వచ్చింది. భగ్న హృదయురాలైన సురయ్య, దేవ్ పంపిన ఉంగరాన్ని సముద్రంలో విసిరేసింది. అలా తన ప్రేమను చంపుకుంది. దో సితారె (1951) వీరిరువురూ కలిసి నటించిన చివరి చిత్రం. దో సితారే సినిమా తరువాత ఎన్నడూ వారిద్దరూ కలసి నటించలేదు. సురయ్య జీవితాంతం అవివాహత గానే మిగిలి పోయింది. తనను ప్రేమించిన దేవానంద్ ను వలచిన ఆమె మరొకరితో జీవితాన్ని పంచుకోలేక పోయింది. వివాహం చేసుకోకుండా జీవితాంతం ఒంటరిగానే గడిపి, సురయ్య తన 75వ సంవత్సరంలో (2004) ముంబాయిలో కన్ను మూసింది. సురయ్య జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం ఓ తపాలా బిళ్ళని విడుదల చేసింది.

# కార్పోరేషన్ విధులను పకడ్బందీగా నిర్వహించాలి

..... జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

మార్చి చివరి నాటికి పూర్తి స్థాయిలో ఆస్తిపన్ను వసూలు చేయాలి

నగర పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

రామగుండం కార్పొరేషన్ పని తీరు పై సమీక్షించిన జిల్లా కలెక్టర్





**అగ్నిధార న్యూస్,(రామగుండం):** రామగుండం కార్పొరేషన్ విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండం పురపాలక కార్యాలయంలో కార్పొరేషన్ పనితీరుపై పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టి.యూ.ఎఫ్.ఐ.డి.సి) నిధుల ద్వారా చేపట్టిన నగరాభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, ఆస్తి పన్ను వసూలు, టౌన్ ప్లానింగ్, తదితర అంశాలను కలెక్టర్ అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ నగరంలో టి.యూ.ఎఫ్.ఐ.డి.సి ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, వరద నియంత్రణ పనులకు ప్రాధాన్యత కల్పిస్తూ వచ్చే వర్షాకాలం నాటికి పూర్తయ్యే విధంగా చూడాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలో నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఆస్తి పన్ను రాబోయే 2 నెలల కాలంలో మార్చి చివరి నాటికి వసూలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం నూతనంగా కొనుగోలు చేసిన ఆటోలు, ట్రాక్టర్ లు పూర్తి స్థాయిలో వినియోగించాలని, నగరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెత్త సేకరణ సంబంధించి నిర్దేశిత షెడ్యూల్ ఫాలో కావాలని , రోడ్లపై ఎక్కడ చెత్త లేకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్పొరేషన్లు టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, అనుమతి లేకుండా ఎక్కడైనా నిర్మాణాలు జరిగితే వెంటనే తొలగించాలని తెలిపారు.అనంతరం కలెక్టర్ శాంతి నగర్ లోని సెంటర్ డ్రై రీసెర్చ్ సెంటర్ , మేడిపల్లి డంప్ యార్డ్ ను పరిశీలించారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రామలింగు, ఎస్ఈ శివానందం, ఈఈ రామణ్, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరుగురు ఏఆర్ కానిస్టేబుల్‌లకు హెడ్ కానిస్టేబుల్ లుగా పదోన్నతి..



పదోన్నతుల ద్వారానే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం

: రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్

పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుల్ లకు శుభాకాంక్షలు తెలిపిన సీపీ

**అగ్నిధార న్యూస్,( రామగుండం):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి కమీషనరేట్ అర్మడ్ విభాగం లో పనిచేస్తున్న ఎఆర్ కానిస్టేబుల్ లు హెడ్ కానిస్టేబుల్ లుగా పదోన్నతి పొందిన సందర్బంగా అట్టి అధికారులకు రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ వారి కార్యాలయంలో అభినందించి వారి ర్యాంక్ పదోన్నతి చిహ్నంను అలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.... పదోన్నతులతోనే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం వస్తుందని ఎలాంటి రిమార్క్ లేకుండా మిగిలిన సర్వీసును పూర్తి చేసి విధుల్లో మంచి పనితీరు కనబరిచి మరిన్ని పదోన్నతులు పొందాలని అన్నారు. పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని సీపీ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని, ఇప్పటివరకు ఎలాంటి క్రమశిక్షణతో విదులు నిర్వహించారో అదేవిధంగా మిగతా సర్వీస్ పూర్తి చేసి మరిన్ని పదోన్నతులు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటాం, మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని, మనం ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అని ఈ సందర్భంగా సీపీ తెలియజేశారు . ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏఆర్ ఏ సి పి సుందర్ రావు, ఆర్ ఐ వామన మూర్తి, రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లాకుంట పోచలింగం, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

సామాజిక సేవలకు అరుదైన గౌరవం

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి

సమత ఫౌండేషన్ చైర్మన్ మార్షల్ దుర్గం నగేష్



**అగ్నిధార న్యూస్,(రామగుండం) :** సమతా ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవను గుర్తించి ఇటీవల భారతీయ దళిత సాహిత్య అకాడమీ న్యూ ఢిల్లీవారు భగవాన్ బుద్ధ జాతీయ అవార్ధును ఫౌండేషన్ చైర్మన్ దుర్గం నగేష్ కు, క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే జాతీయ అవార్డును వారి సతీమణి దుర్గం ప్రమీలకు , మహాత్మ జ్యోతిబాపూలే జాతీయ అవార్డును దుర్గం విశ్వనాద్ కు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డును ముడిమడుగుల సురేష్ కు అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం సమతా సైనిక్ దళ్ ఎన్టీపీసీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలకు అభినందిస్తూ శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వీట్ తినిపించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గం నగేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో పే బ్యాక్ టు ద సొసైటీ నినాదంతో సుమత ఫౌండేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. సమత ఫౌండేషన్ ద్వారా బడుగు, బలహీన వర్గాలకు విద్యా వైద్యం ఉపాధి మొదలైన సేవలందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా సమతా సైనిక దళ్ ద్వారా పేదలకు రాజ్యాంగం కల్పించిన కనీస మౌలిక సదుపాయాలైన కూడు గుడ్డ, విద్య, వైద్యం ఉపాధి మొదలైన సేవలు అందేలా పోరాడుతున్నామని తెలిపారు. తమ సమతా ఫౌండేషన్ ద్వారా కరోనా విపత్కర సమయంలో నిరాశ్రయులైన వారికి ఎంతోమందికి సేవలు అందించామని అన్నారు. ప్రకృతిలో మానవ జన్మ గొప్ప వరమని ఏ జంతువుకు లేని విచక్షణ జ్ఞానం మనుషులకు ఉందని మనమంతా కుల మత వర్గ భేదం లేకుండా భగవాన్ బుద్ధుడు చూపిన మార్గంలో జీవించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవ భావం కలిగి ఉండి, ఆపదలో ఉన్న వారికి ఎంతో కొంత సహాయం అందించాలని సూచించారు. తమ సేవలను గుర్తించి జాతీయ అవార్డులు ప్రధానం చేసిన భారతీయ దళిత సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు సుమనాక్షర్, రాష్ట్ర అధ్యక్షులు జితేందర్ మనులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంత చక్కటి ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి తమను సత్కరించిన సమత ఫౌండేషన్ సభ్యులందరికీ ధన్యవాదములు తెలిపారు. తమ సేవలకు అవార్డులు పొందడం చాలా ఆనందంగా ఉందని, సమాజ సేవ చేయడంలో మరింత బాధ్యత పెరిగిందన్నారు. తమ శక్తివంచన మేరకు సామాజిక సేవలో ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ ఎన్టీపీసీ పట్టణ కమిటీ సభ్యులు మాదరవేణి మధు. చిదురు వసంతరావు. జుమ్మిడి అశోక్. చీమల ఆనంద్. చింతల శ్రీనివాస్. చందనగిరి శివప్రసాద్. జిమ్మిడి శాంతి కుమార్. దుర్గం వెంకట నరసయ్య,,దుర్గం చిన్నక్క.రామగుండం కార్పొరేషన్ నేతకాని సంఘం నాయకులు కుమ్మరి మల్లేష్. కాంగ్రెస్ పార్టీ మూడవ డివిజన్ మహిళా అధ్యక్షురాలు నాస సునీత. అన్నపూర్ణ కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు

# కల్వకుర్తి పట్టణంలో మృతుడు కుటుంబానికి ఆర్థిక సహాయం



ఉప్పల చారి ట్రబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీ కి చెందిన కానాపురం మురళి అనారోగ్యంతో మరణించడం జరిగింది.మృతుడు మురళి కృష్ణ గురించి దారమోని గణేష్ ద్వారా తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ సహకారంతో మురళి కృష్ణ కుటుంబానికి 3000/ ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో, ఉప్పల వెంకటేష్ సైన్యం తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్,పెద్దలు ఇప్ప శ్రీనివాసులు,స్ఫూర్తి శ్రీనివాస్, శ్రీపురం శివ ప్రసాద్,రామకృష్ణ,జగన్,ఏకాంబరం, శివ ,అల్లుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నేడు కల్వకుర్తి నియోజకవర్గంలో సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి పర్యటన



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ తెలంగాణ టాస్క్ సీ ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిఆమనగల్ కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం లో పాల్గొననున్నారు.సమయం 11:00 గం.లకు.మధ్యాహ్నం 12:00గంటల నుండి ఆమనగల్ ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.కావున ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు అందుబాటులో అన్న అభిమానులు, శ్రేయోభిలాషులందరు పాల్గొన గలరని మనవి.

# ఆహ్వాన పత్రిక అందజేత



లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు దోకూరి ప్రభాకర్ రెడ్డి కి ఆహ్వానం

**అగ్ని ధార న్యూస్ ( కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం లోని వెల్జాల్ గ్రామంలో ఫిబ్రవరి 7, 8, 9, తేదీలలో జరిగే శ్రీ శ్రీ శ్రీ వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోకూరి ప్రభాకర్ రెడ్డి ని, బ్రహ్మోత్సవాలలో కుటుంబ సమేతంగా పాల్గొనాలి అని, ఆలయ కమిటీ ధర్మ కర్త శ్రీనివాస మూర్తి ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగింది. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు భగవాన్ రెడ్డి ని, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు, మాజీ ఎంపీటీసీ జోగు రమేష్, నాయకులకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, నాయకులు, నర్సింహులు, ఎం.ఏ.అజీజ్, జనార్ధన్ రెడ్డి యాదగిరి, సభావాత్ రాజేందర్ నాయక్, నుకం శేఖర్, తుమ్మ నరసింహ,తదితరులు పాల్గొన్నారు.

# మడేల్లయ్య దేవాలయనికి! భూమి పూజ



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మట్ట వెంకటయ్య గౌడ్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** వెల్దండ మండల కేంద్రంలో రజకుల ఆరాధ్య దైవమైన మడేల్ స్వామి దేవాలయ నిర్మాణానికి గురువారం వెల్దండ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, రజక సోదరులతో కలిసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ, రజకులు ఐక్య మత్యంతో మెలుగుతే అభివృద్ధి జరుగుతుంది అన్నారు.భక్తితోనే ముక్తి లభిస్తుందని ప్రతి ఒక్కరూ దైనందిక జీవితంలో దైవచింతను అలవర్చుకోవాలని గ్రామంలో దేవాలయ నిర్మాణానికి పూనుకున్న రజక సోదరులను అభినందించారు. ఆలయ నిర్వాకులు ముఖ్య అతిథులను శాలువాలతో సన్మానించారు కార్యక్రమంలో, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు కురిమిద్దె యాదగిరి, ఎర్ర శ్రీను ముదిరాజ్, శ్రీశైలం ముదిరాజ్, భరత్ గౌడ్,కిష్టాల్ , రామకృష్ణ, మల్లేష్,రాజేష్, రాకేష్, శ్రీను,వెంకటయ్య,తోపాటు తదితరులు ఉన్నారు.

# హనుమాన్ దేవాలయానికి సిమెంట్ బస్తాలు విరాళం



గిరిజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ నాయక్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కడ్తాల్ మండలంలోని గానుగుమర్ల తండా గ్రామపంచాయతీ పరిధిలోని కానుగుబాయ్ తండాలో హనుమాన్ దేవాలయానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 50 బస్తాలు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ వెంకటేష్ 50 బస్తాలు, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ 50 బస్తాలు సిమెంట్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూ,కడ్తాల్ మండలంలో నీ రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బడుగు బలహీన వర్గాలను ఆదుకోవడంతోపాటు నలుగురికి ఉపయోగపడే గుడులు బడులకు కూడా తమ ట్రస్టు ద్వారా తోచిన సాయం అందిస్తున్నామని తెలిపారు. తమకు తోడుగా మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ కూడా చేదోడువాదోడుగా తన వంతు సాయాన్ని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో,మాజీ ఎంపీపీ సువాలి పంతు, మాజీ ఎంపిటిసి గోపాల్,గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు పాండు, శంకర్, రాజు ,భీమన్ , మహేష్, కుమార్, నవీన్, లక్ష్మణ్, టీక్ లాల్, చందర్, మహేందర్, బాలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానానికి మైక్ సెట్ అందజేత



రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు తలసాని కృష్ణారెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** మార్చాల గ్రామంలో జరిగే శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు గ్రామంలోని మాల కమిటీ వారి కోరిక మేరకు 20,000 రూపాయల విలువ గల మైక్ సెట్ ను దేవాలయానికి విరాళంగా అందజేసిన రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు తలసాని కృష్ణారెడ్డి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, గ్రామ మాజీ సర్పంచ్ దేశం సునీత వెంకట్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మదన్ మోహన్ రావు, దేవస్థానం కమిటీ సభ్యులు సామ సత్యపాల్, చలిచీమల చెన్నయ్య,గోరటి మల్లేష్, గోరటి కిరణ్, శ్రీశైలం , వట్టేపు రామకృష్ణ, పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నివాసంలో ఘనంగా గాంధీజీ వర్ధంతి వేడుకలు



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** హైదరాబాదులోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో గాంధీజీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ,బాపూజీ అహింసా మార్గం అందరికీ అనుసరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అహింస ,శాంతి సిద్ధాంతాల ద్వారా దేశ ప్రజలను ఏకం చేసి స్వాతంత్రాన్ని సాధించిన మహాత్మా గాంధీ చిరస్మరణీయుడని ఆయన కొనియాడారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు హైదరాబాదులోని ఎమ్మెల్యే కసిరెడ్డి నివాసంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట గీతా నరసింహ, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూదిని కొండల్ రెడ్డి, వెంకటేశ్వరరావు లతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ చూపిన శాంతి బాటలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగి సమాజ శాంతి స్థాపనకు బాటలు వేయాలన్నారు. శాంతి, సహనం ప్రగతికి మార్గమని ఆయన పేర్కొన్నారు . గాంధీజీ ఆశయాల కనుగుణంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతూ గ్రామాల అభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు పెద్దపీట వేస్తుందన్నారు. గ్రామాలే దేశానికి పట్టుకోమ్మలని అందుకే సీఎం రేవంత్ రెడ్డి గ్రామ స్వరాజ్య స్థాపన ధ్యేయంగా పథకాలు రూపొందించి అమలు చేస్తున్నట్లు నారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో, నాయకులు పెంటారెడ్డి, సురేందర్ రెడ్డి ,వెంకట్ రెడ్డి, శంకర్, భీష్మ చారి, దేవయ్య, వెంకటరమణ, సాయిలు, జంగం సుగుణ, సత్యనారాయణ, అంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముగిసిన ఆట పోటీలు



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** నిస్వార్థ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డిస్ట్రిక్ట్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి.వనపర్తి

ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన కబడ్డీ. వాలీబాల్,రన్నింగ్ క్రీడల్లో యువతీ,యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు క్రీడల్లో పాల్గొనాలని ప్రతి ఒక్కరు ఆరోగ్యం మీద అవగాహన ఉండాలి అని సూచించారు.గెలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.


కార్యక్రమంలోపి ఈ టీ మలాకర్, మద్దిలేటి,నిస్వార్థ ఆర్గనైజేషన్ సభ్యులు రఘు జగన్ సాయి,,పవన్, అర్వింద్,శరత్,మహేష్ కార్తీక్ చాణక్య,తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా గాంధీజీ వర్ధంతి



**అగ్ని ధార న్యూస్ హైదరాబాద్ జిల్లా :** హైదరాబాద్ లో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగాని ర్వహించారు. హైదరాబాద్ లోని వనస్థలిపురం లో గల మహాత్మా గాంధీ విగ్రహానికి సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్.చంటి ముదిరాజ్ మాట్లాడుతూ జాతిపితగా మహాత్మా గాంధీ చూపించిన అహింసా మార్గంలో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని అన్నారు. దేశాభివృద్ధిలో మహాత్మా గాంధీ సూచనలను అనుసరిస్తూ యువత అడుగులు వేయాలని అన్నారు.సమాచార హక్కు చట్టం సాధన కమిటీ అన్నివేళలా ప్రజలకు సేవ చేసేందుకు ముందుంటుందని డాక్టర్.చంటి ముదిరాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు జి.ప్రియా రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అంతటి అజయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి దీపక్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ కి నివాళులర్పించిన నగరపాలక సంస్థ సిబ్బంది



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని:** స్వాతంత్ర్య అమర వీరుల దినోత్సవం పురస్కరించుకుని గురువారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. నగర పాలక సంస్థ ఎస్ ఇ శివానంద్, ఇ ఇ రామన్ లు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసినివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# భారత స్వాతంత్ర్య సమర యోధుడు స్వర్గీయ మహాత్మా గాంధీకి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** భారతదేశ స్వాతంత్రం కోసం శాంతియుతంగా ఎన్నో సత్యాగ్రహాలు, పోరాటాలు చేసి స్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టిన పూజ్య బాపూజీ మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం ఉదయం ఐ.డి.ఒ.సి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు తో కలిసి మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూల మాలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాపూజీ కుష్టు వ్యాధి గ్రస్తుల పట్ల ఎంతో ప్రేమ, ఆప్యాయత చూపించే వారని, కుష్టు వ్యాధి ఒక బ్యాక్టీరియా వల్ల వస్తుంది కానీ ఇది ఒకరి నుండి ఒకరికి సంక్రమించదని వారి పట్ల సమాజంలో ప్రేమ అభిమానం చూపించాలని బాపూజీ ప్రచారం చేసి వారికి ఆశ్రయం కల్పించారన్నారు. అందుకే మహాత్మా గాంధీ వర్ధంతి రోజున జాతీయ కుష్టు వ్యాధి నివారణ దినోత్సవంగా సైతం పాటిస్తామని తెలియజేశారు. కుష్టు వ్యాధి గ్రస్తులకు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఏర్పాటు చేసిన పౌష్టికాహార ధాన్యం కోట్లను



కలెక్టర పంపిణీ చేశారు. ఐ.డి. ఒ. సి లోని సిబ్బంది అందరితో కుష్టు వ్యాధి నివారణ దినోత్సవం పై ప్రతిజ్ఞ చేయించారు.నా కుటుంబంలో లేదా పొరుగువారిలో వారిలో లేదా సమాజంలో ఎవరికైనా చర్మంపై స్పర్శ కోల్పోయిన మచ్చలు ఉండి, వాటిని తాకినప్పుడు లేదా వాటిపై నొప్పి కలిగించనప్పుడు తెలియక పోయినట్లైతే, లేదా కుష్టువ్యాధి కారణంగా కనిపించే అంగవైకల్యము ఏర్పడిన వారి పట్ల శ్రద్ధ వహిస్తానని మరియు వారి -నివాసానికి సమీపంలో ఉన్న ఏదైన ప్రభుత్వ సంస్థ నుండి పూర్తి చికిత్స తీసుకొనేలా సూచనలిస్తానని మహాత్మాగాంధీ వర్ధంతి రోజు కార్యక్రమంలో నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను.

నాసొంత కుటుంబం సభ్యుల లాగా భావించి, వారికి నేను ప్రేమతో చికిత్స చేస్తానని మరియు ఏ విధమైన వివక్షత చూపకుండా వారి ఆత్మ గౌరవాన్ని పరిరక్షించేలా శ్రద్ధతో చికిత్స అందిస్తాను. కుష్టువ్యాధి పూర్తిగా నయమవుతుంది. సత్వర చికిత్స వలన అంగవైకల్యాలను నివారించవచ్చు. మరియు కుష్టువ్యాధి సోకిన వ్యక్తులపై వివక్షత చూపరాదు. కుష్టువ్యాధికి సంబంధించిన ఇలాంటి సందేశాలను సమాజంలో వ్యాప్తి చేస్తాను.మహాత్మగాంధీ కలలు కన్న విధంగా, సమీప భవిష్యత్తులో కుష్టువ్యాధి రహిత భారతదేశ నిర్మాణములో అందరితో కలిసి కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నానని ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా అధికారులు, కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చార్సౌ బీస్ చార్సవు దిన్ పేరిట గాంధీకి వినతి

వనపర్తి బి ఆర్ ఎస్ నాయకులు



**అగ్ని ధార న్యూస్ వనపర్తి వనపర్తి జిల్లా :** చార్ సవ్ భీస్,చార్ సవ్ దిన్ పేరిట జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యములో వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పట్టణ పార్టీ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమాళ్ళ.అశోక్ మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100రోజులలో హామీలు అన్ని అమలు చేస్తామని చెప్పి నేటికీ 420రోజులు గడిచినా రైతు భరోసా రైతు రుణ మాఫీ,రైతు బోనస్ యెగ్గొట్టిందని అదేవిధంగా మహిళకు 2500,తొలమ్బంగారం,వృద్ధులకు 4000 ఫించన్లు ఇస్తామని మోసం చేసిందని దుయ్యబట్టారు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ బి.లక్ష్మయ్య, జాత్ర్ నాయక్,గంధం.పరంజ్యోతి,కౌన్సిలర్స్ బండారు కృష్ణ, నాగన్న యాదవ్,కంచే.రవి, ఉంగ్లమ్మ. తిరుమల్,ప్రేమ్ నాథ్ రెడ్డి,స్టార్.రహీమ్,రమేష్ నాయక్,గులాం ఖాదర్ ఖాన్,ఇమ్రాన్, అవుల.రమేష్,బీచుపల్లి, నీలస్వామి, మురళీ సాగర్,డాక్టర్.డ్యానియాల్,కేశవులు, జోహెబ్బ్ హుస్సేన్, చిట్యాల.రాము,మాధవ్ రెడ్డి,పి.సురేష్,మన్నెం,అరీఫ్, A.K.పాషా,సాధిక్ ,ఖయ్యాం,వడ్రాల .సాయిబాబా,బండారు.శ్వేత,లక్ష్మణ్ గౌడ్ బ్రదర్స్,ఖలీల్,ఇంతియాజ్,వడ్రాల. రమేష్,తోట.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీ1 జిఎం కార్యాలయంలో అమరవీరుల కు నివాళులు అర్పించిన సింగరేణి సిబ్బంది



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని :** అర్జీ1 జి యం కార్యలయం నం దు .భా రత ప్రభుత్వ హెూం వ్యవహారాల మం త్రిత్వ శాఖ ఆదేశానుసా రం భారతదేశ స్వాత ంత్ర్య పోరాటంలో ప్రాణా లను త్యాగం చేసిన వారి జ్ఞాపకార్థం ఆర్జీ.1 ఏరియా పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి అధ్యక్షతన 30 జనవరి 25న అమరవీరులదినోత్సవం సందర్భముగాఉదయం సింగరేణి ఉద్యోగులుమౌనం పాటించి వారి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగావ్యక్తలుమాట్లాడుతూ ... భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం 30 జనవరి రోజున నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి కార్యక్రమం అన్ని గనుల లోమరియుకార్యాలయములో నిర్వహించడం జరిగినదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి సాయి ప్రసాద్ ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరి అరెల్లి పోషం, సి.ఎం.ఓ.ఐ ఇంచార్జ్ క్రాంతి, జియం ఆఫీస్ ఇంచార్జ్ రాజు, ఏరియా ఇంజనీరు దాసరి వెంకటేశ్వర్ రావు, ఎన్విరాన్ మెంట్ డిజియం ఆంజనేయ ప్రసాద్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్స్ బంగారు సారంగపాణి, శ్రావణ్ కుమార్, హన్మంతరావు, బీమా, వసంత్ కుమార్, వీరారెడ్డి, ఉమేష్, అక్బర్ అలీ మరియు ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# కేటీఆర్ సమావేశం విజయవంతం చేయండి



-పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్ :** గండీడ్ : కేటీఆర్ సమావేశాన్ని విజయవంతం చేయాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తెలిపారు గురువారం గండీడ్ మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

వచ్చేనెల 1వ తేదీన కులకచ్చర్ల మండలం దాసానాయక తండాలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరవుతున్న కేటీఆర్ సమావేశానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల నుండి ముఖ్య నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

-ప్రజాపాలనంటూ ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం ...ప్రజా పాలన అంటూ ప్రభుత్వంప్రజలనుమోసం చేస్తుందని తెలిపారు. రైతు ప్రభుత్వం అంటూ రైతుల నడ్డి విరుస్తుందని స్థానిక సంస్థల ఎన్నికల ముందు నాలుగు పథకాలు ప్రారంభమంటూ ప్రచారం చేసుకొని కేవలం మండలానికి ఒక గ్రామాన్ని రైతు భరోసావేసి అందరికీ వేసామంటూ చెప్పుకుంటున్నారు అలాగే మిగతా గ్రామాల రైతులకు మాత్రం మార్చి 30 తేదీని పెట్టడం ఎందుకన్నారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామచంద్ర రెడ్డి గండీడ్ మమదాబాద్ మండల పార్టీ అధ్యక్షులు పెంట్యా నాయక్, బిక్షపతి వివిధ గ్రామాల మాజీ సర్పంచులు బెస్త రాజేశ్వర్ ,కృష్ణారెడ్డి, రఘు యాదవ్ ,కిరణ్ కుమార్ రెడ్డి తిరుమలరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు ఉన్నారు

# చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా మహాత్మా గాంధీ 77వ వర్ధంతి



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్ గండీడ్ :** మండలంలోని చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాలలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు మహాత్మా గాంధీ 1869 అక్టోబర్ 2 న గుజరాత్ రాష్ట్రంలోని పోరుబందరు లో జన్మించారు. సహాయ నిరాకరణ ఉద్యమం,సత్యాగ్రహం శాంతి అహింసా మార్గంలో స్వాతంత్రం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. మహాత్మా గాంధీ 1948 జనవరి 30 న చనిపోయారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అంగడి అరుణదేవి,ఉపాధ్యాయులు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య,బి. మల్లేష్,కె.వెంకటయ్య విద్యార్థులు పాల్గొన్నారు

# దేశానికి వెలుగులే కాదు స్థానికంగా కులవృత్తులకు ఉపాధి కల్పించాలి.

## విద్య వైద్య ఉద్యోగ అవకాశాలు స్థానికులకే కల్పించాలని బిఎస్ సిపి జిల్లా అధ్యక్షులు శీలం శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్.

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని రామగుండం,:** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలో 50 ఏళ్ల కిందట బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నిర్మించారని ఇప్పటివరకు భూములు కోల్పోయిన అన్నదాతలను ఆదుకున్న పాపాన పోలేదని భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో ఎన్టిపిసి యాజమాన్యం ప్రభుత్వాలు విఫలమయ్యాయని భారతీయ స్వదేశీ కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు శీలం శ్రీనివాస్ ముదిరాజ్ ఆరోపించారు. బుధవారం గోదావరిఖనిలో జరిగిన సమావేశంలో శీలం శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్టిపిసి ఫేస్ 2 నిర్మాణానికి మంగళవారం పర్యావరణ కాలుష్య బోర్డ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి పోలీసు పహారా నిర్బంధంలో కొనసాగిందని ప్రజల అభిప్రాయాలు లేకుండా నిర్వహించే సభ.. ప్రజాభిప్రాయ సేకరణ ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఏళ్ల కిందట నిర్మించిన పవర్ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన వారికి ఎంతవరకు ఎలాంటి ఉద్యోగ అవకాశాలు సమస్యల పరిష్కారం కాలేదని తిరిగి మళ్లీ ప్రాజెక్టు విస్తరణ పేరుతో ఈ ప్రాంతంలో పోలీసు పహారా మధ్య అధికారులు పాలకవర్గం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు ఒకపక్క ఈ ప్రాంతంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. గాలి, నీరు, కాలుష్యం కోరల్లో విషపు వృక్షము కింద ప్రజలు తీవ్రభయాందోలనలతో బతుకీడుస్తున్నారు. యువత ఉద్యోగాలు లేక అల్లాడుతున్నారు కనీసం కాంట్రాక్టు ఉద్యోగాలు దక్కడం లేదన్నారు. పర్యావరణవేత్తలు వైద్యులు ఈ ప్రాంతంలో ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా దేశానికి వెలుగులు నింపేందుకు ఈ ప్రాంత ప్రజలు విద్యుత్ నిర్మాణానికి అనుకూలంగా ఉన్న వారి కనీస సౌకర్యాలు మౌలిక వసతులు కల్పనలో యాజమాన్యం పాలకులు విస్మరిస్తున్నారని విమర్శించారు. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు లేకుండా పోలీసులతో అభిప్రాయ సేకరణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. వేలాది ఎకరాలు కోల్పోయి వ్యవసాయ ఆధారిత భూములు కోల్పోయి రైతులు ఇబ్బందులు, నీటి కాలువలు, చెరువులు కుంటలు, ఈత, తాటివనం విద్యుత్ ప్రాజెక్టుకు దగ్ధంవై చేపలు పట్టే మత్స కారులు, ముదిరాజుల జీవన విధానం, గౌడ్ అన్నలు రజకులు పూర్తిగా ఉపాధి లేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారని కులవృత్తులను ఎన్టిపిసి యాజమాన్యం ప్రోత్సహించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రజలతో మమైకమై ప్రజాభిప్రాయం సేకరణ తిరిగి చేపట్టాలని అధికారులను కోరారు.

# కాంగ్రెస్ కు బుద్ధి ప్రసాదించాలి

**గాంధీ విగ్రహానికి వినతి పత్రం.**
**కాంగ్రెస్ పార్టీకి ఓటేసి తప్పు చేశామని ప్రజలు బాధపడుతున్నారు.**
**రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్.**



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని:** 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నో అమలుగాని హామీలను ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ల పేరుతో, హామీల పేరుతో, గ్యారంటీల పేరుతో 420 బూటకపు హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని,వంద రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పి.. 420 రోజులైనా హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వంపూర్తిగావిఫలమైందని హామిలను అమలు చేసేలా మహత్ముడు కాంగ్రెస్ పార్టీకి బుద్ది ప్రసాదించాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు.420 హామీలు %-% 420 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత పాలనకు నిరసనగా, మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గోదావరిఖని పట్టణంలో మహాత్మా గాంధీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్నికల్లో విజయం సాధించి, అధికారంలోకి వచ్చిన రోజు నుండే హామీలపై రకరకాల సాకులతో కాలం వెళ్లదీస్తూ, కొన్ని పథకాలకు ఏవేవో కొర్రీలు పెట్టి లబ్దిదారులను తగ్గించే ప్రక్రియ కాంగ్రెస్ ప్రభుత్వంప్రారంభించిందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తోపాటుకాంగ్రెస్ నేతలంతా అబద్ధాలు చెప్పి ప్రజలనుమోసంచేసేప్రయత్నంచేస్తున్నారన్నారు.మహాత్మునీ అడుగుజాడల్లో కేసీఆర్ స్వరాష్ట్రాన్ని సాధించి, మహత్ముని ఆశయాలే స్ఫూర్తిగా బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో తెలంగాణను ప్రగతిపథంలోనడిపించారన్నారు. సబ్బండ వర్ణాలసంక్షేమమే లక్ష్యంగా ఎన్నో విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుట్టి తెలంగాణరాష్ట్రముఖచిత్రాన్ని, తెలంగాణ ప్రజల బతుకు చిత్రాన్ని సమూలంగా, సమున్నతంగా మార్చి దేశంలోనే ఒక ఆదర్శ రాష్ట్రంగా, !అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దింది తొలి సిఎం కేసీఆర్న్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సరిగ్గా ఈ జనవరి 30న 420 రోజులు పూర్తిచేసుకుంటోంది. మోసపూరిత వాగ్దానాలతో ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి ప్రతినిత్యం ప్రజలను వంచిస్తూనే ఉన్నారన్నారు. ఎన్నికల్లో పంచిన గ్యారెంటీ కార్డుకు, ఇచ్చిన 420 హామీలకు పాతరేసి అటెన్షన్ డైవర్షన్ డ్రామాలతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు.ఈ అసమర్థకాం గ్రెస్ప్రభు త్వానికికళ్లుతెరిపించాలని, ఈ దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వానికి దారి చూపించాలని, ఈ చేతకాని కా ంగ్రెస్ సర్కారుకు బుద్ధి ప్రసాదించాలని ఈ అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగించాలని మహత్మున్ని వేడు కు న్నారు. ఈ కార్యక్రమం లో బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు మూల విజయ రెడ్డి మాజీ కార్పోరేటర్లు కుమ్మరి శ్రీనివాస్ గాధం విజయ కల్వచర్ల కృష్ణ వేణి బాదే అంజలి శివకుమార్ నాయ కులు నారాయణదాసు మారుతి, బోడ్డు రవీందర్, బోడ్డుపల్లి శ్రీనివాస్, రాకం వేణు ,అచ్చే వేణు, తోట వేణు, సట్టు శ్రీని వాస్,బొబ్బిలి సతీశ్ ,తోకల రమేష్, ఇరుగురాళ్ల శ్రావన్, జిమ్మి బాబు, ఆడప శ్రీనివాస్, వెంకన్న , కోడి రామకృష్ణ, ముద్దసాని సంధ్యా రెడ్డి, వెంకటస్వామి, కిరన్ జీ, శంకర్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## మాయ మాటల సర్కార్ కు ప్రజలే గుణపాఠం చెబుతారు..!

**కమాన్ పూర్ లో రాష్ట్ర సర్కార్ తీరుకు వ్యతిరేఖంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన**
**ఇచ్చిన హామీలు అమలు చేయాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేత**



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు అంటూనే 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కినంకా ఇదిగో.. అదిగో అంటూ మభ్య పెడుతున్న మాయ మాటల సర్కార్ కు ప్రజలే గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ శంకర్ అన్నారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం గురువారం బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తరుచూ దాటవేత ధోరణి అవా లంబిస్తూ మోసం చేస్తుం దన్నారు. వృద్ధుల, వితంతువుల, వికలాంగుల ఫించన్లు పెంచుతామని, కళ్యాణలక్ష్మి పథకం లో తులం బంగారం, ప్రతి మహిళకు రూ, 2500 లు ఇస్తామని ఇలాంటి హామీలు కోకొల్లలు గుప్పించి ఇప్పుడేమో ఇంకా గారడీ మాటలతో ప్రజలను మభ్యపెడుతుందని ఆరోపించారు. పూటకో మాట మారుస్తున్న కాంగ్రెస్ సర్కార్ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ శంకర్ తో పాటు బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, కొట్టె భూమయ్య, మాజీ ఎ. ఎం. సీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, మాజీ సర్పంచులు కొండ వెంకటేష్, ఆకుల గట్టయ్య, నాయకులు నీలం శ్రీనివాస్, రాచకొండ రవి, పోలుదాసరి సాయి కుమార్, కొయ్యడ రవి, పులిపాక రాయలింగు, జాబు సతీష్, దండే కిషన్, సుధాకర్, కొయ్యడ కుమార్ యాదవ్, సుధాకర్, ఎలాబోయిన రామ్మూర్తి, తోట రాజ్ కుమార్, సాన సురేష్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు..!



**అగ్నిధార న్యూస్ కమా న్ పూర్ :** జాతిపితా మహా త్మా గాంధీ వర్ధంతి వేడుక లను గురువారం మండ లంలోని రొంపికుంట గ్రా మంలోని ఆరోగ్య ఉప కేంద్రం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అందరు ఆరోగ్యాంగా, సంతోషంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ. ఎన్. ఎం శైలజా, గ్రామస్తులు కోలా నర్సాగౌడ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్




**అగ్ని ధార న్యూస్. మందమర్రి మండలం జనవరి 30. :** మంచిర్యాల జిల్లా,మందమర్రి సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో.. స్కూల్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడంలో..11 టీములు పాల్గొనగా, నజీర్ సౌండ్ సిస్టం ఆర్గనైజింగ్ అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ వారి, స్పాన్సర్స్ స్కూల్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా.. మందమర్రి సింగరేణి ఏరియా జి.ఎం. దేవేందర్,ఎమ్మార్వో సతీష్, ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్,పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి, ఎస్.ఐ ఎస. రాజశేఖర్, పాల్గొన్నారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ... యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా.. క్రీడారంగంపై దృష్టి పెట్టి, మంచి విజయాలను సాధించాలని, శారీరకంగా దృఢత్వాన్ని పెంచుకుంటూ.. గంజాయి, మద్యం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, దేశ ప్రగతిని సాధించే విధంగా.. ముందుకు సాగాలని సూచించారు. క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్స్ పెరిక శ్రీకాంత్, సమీర్ చంటి, గుల్షన్, ప్రసాద్, అభికాలే, సమీర్, నంది పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకల్లో.. పాల్గొన్న చెన్నూరు ఎమ్మెల్యే



**అగ్నిధార న్యూస్. మందమర్రి మండలం జనవరి 30. :** మందమర్రి మండలం రామకృష్ణాపూర్ లో.. నిర్వహించిన మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి.గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించిన ఎమ్మెల్యే.మందమర్రి, మంచిర్యాల లో.. వివిధ పత్రికల నూతన సంవత్సర క్యాలెండర్ల ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ...అహింసా మార్గంలో భారత దేశానికి స్వాతంత్రం సాధించి పెట్టిన మహనీయులు గాంధీజీ.ప్రతి ఒక్కరూ.. గాంధీ మహాత్మున్ని ఆదర్శంగా తీసుకోవాలి. గాంధీజీ చూపిన బాటలో నేటితరం నడుస్తూ..అయన ఆశయాలను కొనసాగించాలి. దేశం కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన ఆణిముత్యం గాంధీజీ.సత్యం,అహింస సిద్ధాంతాల ద్వారా.. ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన మహనీయుడు.గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సాధించడానికి ప్రతి ఒక్కరూ.. ముందుకు రావాలి.జాతి వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన ప్రపంచ గొప్ప యోధుడు మహాత్మా గాంధీజీ అని అన్నారు.

## హైకోర్టు తీర్పుతోనే మందమర్రిలో.. ఎన్నికలు:ఎమ్మెల్యే వివేక్



**అగ్ని ధార న్యూస్. మందమర్రి మండలం జనవరి 30. :** మందమర్రిలో ఎన్నికలు జరగాలంటే హైకోర్టు తీర్పుతోనే సాధ్యమవుతుందని, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని దీపక్ నగర్ లో అడ్వకేట్ కస్తూరి శ్రీనాథ్ ఇంటి వద్ద, మందమర్రి స్థానిక సంస్థల ఎన్నికల జేఏసీ ఆధ్వర్యంలో.. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో.. స్వాతంత్ర్యం తరువాత మందమర్రికి సంబంధించిన పూర్తిస్థాయి షెడ్యూల్ ఏరియా మ్యాప్ ను ఎమ్మెల్యేకు వివరించి, మందమర్రిలో ఎన్నికల నిర్వహించాలని జేఏసీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... సుప్రీంకోర్టు నిబంధన మేరకు, జేఏసీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ కు సంబంధించి మంచిర్యాల జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్ పూర్తి వివరాలతో హైకోర్ట్ లో జేఏసీ పిటీషన్ కు కౌంటర్ దాఖలు చేసినట్లు ఆయన తెలిపారు. హైకోర్టు తీర్పు వెల్లడించిన తర్వాత మందమర్రిలో ఎన్నికలు జరుగుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో.. జేఏసీ అధ్యక్షుడు గుడికందుల రమేష్, కార్యదర్శి మేసినేని అరుణ్ కుమార్, న్యాయవాది శ్రీనాథ్ చారి, ఉపాధ్యక్షుడు మాయా శ్రీనివాస్, సభ్యులు రామంచ తిరుపతి,బీమ్ సేన్, ముజాహిద్, తదితరులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ అవార్డు గ్రహీతను సన్మానించిన కందుల సంధ్యారాణి



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని** బిజెపిరామగుండం నియోజకవర్గం ఇన్చార్జి కందుల సంధ్యారాణి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కి పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా కందుల సంధ్యారాణి హైదరాబాదులో వారి నివాసం నందు కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో భారతీయ జనతా పార్టీ ఓ బి సి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడుగు కృష్ణ ముదిరాజ్. బిజెపి నాయకులు కందుల పోషం తదితరులు ఉన్నారు.

## ముస్లీం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని:** గోదారిఖని గాంధీనగర్ లోని నురాని అరబిక్ స్కూల్లో ఉచిత కంటి వైద్య శిబిరం ముస్లీం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తేది:1ఫిబ్రవరి శనివారం రోజున గోదావరిఖని గాంధీనగర్ లోని నురాని అరబిక్ స్కూల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం డాక్టర్ భవ్య కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు షేక్ హాజీ అలీ అధ్యక్షులు తెలిపారు . కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఈ వైద్య శిబిరాన్నివినియోగించుకోవాలని పత్రికా ప్రకటనలో తెలిపారు.

## అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి

**ఇంచార్జ్ఎంపీడీవో నరేందర్ రెడ్డి**



**అగ్నిధార న్యూస్మహమ్మదాబాద్:** మండల ప్రజలు, అధికారులు, నాయకులు సహకరిస్తే మహమ్మదాబాద్ మండల అభివృద్ధికి కృషి చేస్తానని మహమ్మదాబాద్ మండల ఇన్చార్జి ఎంపీడీవో నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం మహమ్మదాబాద్ మండల ఇంచార్జ్ ఎంపీడీవోగా నరేందర్ రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. ఉమ్మడి గండీడ్ మండల ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు నూతనంగా ఏర్పడిన మహమ్మదాబాద్ మండలానికి ఇంచార్జ్ ఎంపీడీవోగా మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారంబాధ్యతలు చేపట్టారు.

## నిత్యవసర సరుకులు అందజేత

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కమాన్పూర్ మండలం లోని పెంచికల్ పేట్ గ్రామానికి చెందిన అటుకపురం చందు కూతురు వైష్ణవికి ఇటీవల గొంతు ఆపరేషన్ చేయించుకుని ఇంటికి వచ్చిన విషయం అనవేణ వేణు ద్వారా సమాచారం అందుకున్న సుందరం ఫౌండేషన్ ఫౌండర్ బోనాల వెంకటస్వామి తమ ఫౌండేషన్ సభ్యులను వారి ఇంటికి పంపి ఈనిరుపేద కుటుంబానికి సుందరం ఫౌండేషన్ సంస్థ సహకారంతో 25కిలోల బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు అందజేశారు, అలాగే వారి కుటుంబ పరిస్థితి గురించి తెల్సుకుని అన్ని విధాల అండగా ఉంటానని ఫౌండర్ వెంకటస్వామి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చిప్పకుర్తి అరవింద్, చెన్నోజు చంద్రశేకర్, గుంజపడుగు నవీన్, కన్నూరి నగేష్, దండే తిరుపతి, చిప్పకుర్తి శ్రావణ్, కుక్క ప్రసాద్ తో పాటు పెంచికల్ పేటకు చెందిన అనవేణ వేణు, గడ్డం నగేష్, కుంభం రవి, అనవేన మనోహర్ మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి..!




**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్, :** ారర హక్కుల పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ వాసంతి సూచించారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గురువారం పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా కల్పించబడిన పౌర హక్కులకు భంగం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామంలో రెండు గ్లాసుల పద్ధతి, దేవాలయాల ప్రవేశం, మంచి నీటి కొళాయిల వద్ద అస్పృశ్యత లాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమాన్ పూర్ -2 ఎస్. ఐ రవళి, ఆర్. ఐ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రసాభసాగా గ్రేటర్ కౌన్సిల్ మీటింగ్

**హైదరాబాద్ :** టర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశాలు రసాభాసగా మారాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య సభలో వాగ్వాదం చోటు చేసుకుంది. సభ ప్రారంభం కాగానే బడ్జెట్పై మాట్లాడాలని మేయర్ విజయలక్ష్మి కోరారు. అయితే ప్రశ్నోత్తరాల కోసం పట్టుబట్టిన బీఆర్ఎస్ సభ్యులు మేయర్కి వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. పోడియం దగ్గరకు దూసుకెళ్లి.. పేపర్లు చించి మేయర్పైకి విసిరారు. వారిని అడ్డుకునేందుకు కాంగ్రెస్ సభ్యులు ప్రయత్నించడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. ఆ గందరగోళం మధ్యే జీహెచ్ఎంసీ వార్షిక బడ్జెట్ను ఆమోదిస్తున్నట్లు మేయర్ గద్వాల విజయలక్ష్మి ప్రకటించారు. బడ్జెట్ ఆమోదం తర్వాత ప్రశ్నోత్తరాలను మేయర్ ప్రారంభించారు. ప్రశ్నోత్తరాల్లోనూ బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. మేయర్ పోడియంను చుట్టుముట్టి బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేశారు. బీఆర్ఎస్ సభ్యుల తీరుపై మేయర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతకీ బీఆర్ఎస్ సభ్యులు అడ్డుపడటంతో జీహెచ్ఎంసీ సెక్షన్ 89/1 ప్రకారం బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేశారు. సభ నుంచి బయటకు పంపడంతో జీహెచ్ఎంసీ ఆఫీస్ ముందు బీఆర్ఎస్ ధర్నాకు దిగిందిప్రజల పక్షాన మాట్లాడితే సభ నుంచి బయటకు పంపుతారా.. అంటూ బీఆర్ఎస్ సభ్యులు నిలదీశారు.

## మీద పడ్డ బండరాళ్లు...

## తల్లి, కూతురు దుర్మరణం

**మెదక్ :** సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బతకడానికి కూలిపనులకు పోతే.. బతుకే లేకుండా పోయింది. బండరాళ్లు మీద పడి తల్లీకూతురు ప్రాణాలు కోల్పోయారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో విషాదం జరిగింది. ఉపాధి హామీ పనులు చేస్తుండగా బండరాళ్లు మీద పడి ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను హుటుహుటీన సమీప ఆసుపత్రికి తరలించారు.ఉపాధి హామీ పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా బండరాళ్లు మీద పడడంతో కందారపు సరోజన.. ఆమె కుమార్తె మమత అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు సహాయకచర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న మృతదేహాలను జేసీబీ సాయంతో వెలికి తీశారు. ఒకే కుటుంబానికి చెందిన తల్లీకూతుళ్ల మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

## వృద్ధులకు వైద్యం, ప్రయాణాలలో రాయితీలు కల్పించాలి

**హైదరాబాద్ :** సీనియర్ సిటిజన్లకు ప్రస్తుతం ఉన్న టికెట్ రాయితీని రైల్వే శాఖ రద్దుచేసింది. కేవలం కింది బెర్త్ మాత్రమే కేటాయిస్తోంది. జనరల్ టికెట్ మినహా స్లీపర్, ఆపై తరగతులకు కనీసం కొంత శాతాన్ని ఇవ్వడం సీనియర్ సిటిజన్లను గౌరవించడమే.కాని 60-70 ఏళ్ల వాళ్ల ప్రయాణాలు తక్కువ ఉంటాయి. 70 దాటితే అవి చాలా అరుదు. వయస్సు మీరిన వారి వల్ల ఉత్పాదక ఉండదనే ఆలోచన సరైనది కాదు. పెన్షనర్లు ప్రభుత్వ సర్వీసులో ఉన్నప్పుడు అన్ని పన్నులు ప్రభుత్వానికి చెల్లించారు. ఇప్పుడు ఆరోగ్య బీమా వంటి పన్నులు చెల్లిస్తున్నారు. ఈ స్థితిలో పెన్షన్ అన్ని అవసరాలకు సరిపోదు. ఈ పరిస్థితులను ప్రభుత్వం వాస్తవ దృష్టితో చూసి, తగిన రక్షణ కల్పించడం భావ్యం. వృద్ధులకు వీలైనంత వరకు వైద్యం, ప్రయాణాలలో ఏదో విధమైన రాయితీ అత్యవసరం.

## బి.సి.లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

**ఫిబ్రవరి 6 న ఛలో ఢిల్లీ**

**పోస్టర్‌ను విడుదలచేసిన ఆర్.కృష్ణయ్య**



**హైదరాబాద్ :** బి.సి లకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బి.సి.లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జాతీయ సెమినార్లు జరపాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 6 మరియు 7న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు రాజ్యసభ జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఒరిస్సా రాష్ట్రాల నుండి పెద్ద యెత్తున పోల్గొంటారని తెలిపారు. ఈ ఛలో డిల్లీ కార్యక్రమానికి సంబందించిన వాల్ పోస్టర్ ను ఆర్. కృష్ణయ్య విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి సుగుణవతి, గుజ్జ కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సెమినార్ లో వివిద పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు బి సి లను ఓటు బ్యాంకు గా వాడుకుంటున్నారు. రాజ్యాధికారంలో వాట ఇవ్వకుండా 76 సం.లుగా అన్యాయం చేస్తున్నారు. జెండాలు మోసుకుంటు, జిందాబాద్ ల నినాదాలు ఇస్తూ బిసిలను వాడుకుంటున్నారని దుయ్యబట్టారు.బిజెపి పార్టీ బీసీ వర్గానికి చెందిన నరేంద్ర మోడీని ప్రధానమంత్రిగా చేశారు. ఇటీవల నలుగురు గవర్నర్లు బి.సి వర్గానికి చెందిన వారిని నియమించారు. జాతీయ బీసీ కమిషన్ కు రాజ్యాంగ బద్ధమైన హోదా ఇచ్చారు. కేంద్రం లో బి.సి రిజర్వేషన్లను వర్గీకరించడానికి కమిషన్ ను నియమించాలి. ఇంకా మిగిలింది బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీలకు సామాజిక న్యాయం కల్పించామన్నారు. కేంద్రంలో బి.సి.లకు ప్రత్యక మంత్రిత్వ శాఖ పెట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.ఈ సందర్బంగా బి.సి సంక్షేమ సంఘం మహిళా విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి గా చెరుకుల సుగుణవతిని నియమించడం జరిగిందణి తెలిపారు. నీలా వెంకటేష్, ,సుదాకర్ ముదిరాజ్,మట్ట జయంతి,వేముల రామకృష్ణ,అనంతయ్య, రాజేందర్,మనికంట,నికిల్, బాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఖరిని ఎండగట్టితే.. బీఆర్ఎస్ కార్పొరేటర్‌లను అరెస్టు చేస్తారా

**హైదరాబాద్ :** జీహెచ్ఎంసీ పాలకమండలి సమావేశంలో హైదరాబాద్ నగరాన్ని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టినందుకు బీఆర్ఎస్ కార్పొరేటర్‌లను అరెస్టు చేయడం దుర్మార్గం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్ నగరానికి నిధులు ఇవ్వడం లేదని కోటి మంది నగర ప్రజల తరపున ప్రశ్నిస్తే బయటకి గెంటేస్తారా? అని నిలదీశారు.గత సంవత్సరం పెట్టిన బడ్జెట్ నిధులను కనీసం కూడా ఖర్చు చేయకుండా.. మరోసారి అవే కాగితాలపైన అంకెలు మార్చి గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ మోసాన్ని అడ్డుకున్నందుకు మా ప్రజాప్రతినిధుల గొంతు నొక్కుతారా? అని రేవంత్ సర్కార్‌ను కేటీఆర్ ప్రశ్నించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి కనీస ప్రజావసరాలను కూడా సరిగ్గా నిర్వహించలేని జీహెచ్ఎంసీ అసమర్థ తీరును ప్రశ్నిస్తే కూడా ఈ ప్రభుత్వం జీర్ణించుకోవడం లేదు. హైదరాబాద్ నగర ప్రజల సమగ్ర అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రారంభించిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు.

## వరంగల్‌లో ఉగ్రవాది కలకలంలో అప్ డేట్

**వరంగల్ :** చెన్నైలో పట్టుబడిన జమాత్-ఉల్ ముస్లీమీన్- ఆల్ ఇండియా ప్రెసిడెంట్ జక్రియాను ఇండియన్ ఇమిగ్రేషన్ అధికారులు విచారించి వదిలేసారు. పాకిస్తాన్ దేశం కరాచీలో జమాత్ సంస్థ నడుస్తోంది. 15 మంది సభ్యులతో జమాత్ కోసం శ్రీలంకలో ఏర్పాటు చేసుకున్న సమావేశంలో పాల్గొని వస్తుండగా ఈ నెల 25న చెన్నై ఏయిర్ పోర్టులో జక్రియా టీం పట్టుపడిని విషయం తెలిసిందే. వారి వద్ద బైత్ ఫామ్ అనే ఒప్పంద పత్రం లభ్యం కావడంతో అనుమానం వచ్చి అందరిని అదుపులోకి తీసుకున్న అధికారులు. జమాత్-ఉల్-ముస్లీమీన్- ఆల్ ఇండియా సంస్థకు భారత్ దేశంలో ఎలాటి నిషేధం లేదని భారత భద్రత అధికారుల నివేదిక ఆధారంగా వదిలినట్లు సమాచారం. ఇదే విషయంపై వరంగల్ పోలీసులు చెన్నై అధికారులను సంప్రదించట్లు సమాచారం. అయితే వారి కి ఎలాంటి ఆదారలు దొరకలేదు అని చెప్పినట్లు సమాచారం.

## కొంపల్లి మున్సిపాలిటీని సమస్యలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కున్నా శ్రీశైలం గౌడ్

**మేడ్చల్ :** కొంపల్లి మున్సిపాలిటీలోని ఆపర్ణ పలం గ్రూవే , రాయలు పర్క్ , చత్ర విల్ లాస్ , అవని లే ఔట్ మరియు పలు కాలనీలోని డ్రైనేజీ, రోడ్ సమస్య పైన కాలనీ అసోసియేషన్ అభ్యర్థనా మేరకు సందర్శిచిన కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఈ యొక్క కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ జెమ్మి దేవేందర్, మాజీ వార్డు మెంబెర్ శివ కుమార్, మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, షైక్ ఇబ్రహీం,జయభేరి గోపాల్ రెడ్డి, ఎర్రోళ కృష్ణ, ఉపేందర్ రెడ్డి, పూర్ణచందర్ రావు, అశోక్ రెడ్డి, డప్పు నరేందర్, సాయి యాదవ్, అంజి ముదిరాజ్, రాము గౌడ్, మరియు కాంగ్రెస్ నాయకులు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు

# గుర్తింపు సంఘం యూనియన్ తో.. 3వ, స్ట్రక్చర్ మీటింగ్

**అగ్ని ధార న్యూస్. మందమర్రి మండలం జనవరి 30. :** మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి.దేవేందర్ అధ్యక్షతన గుర్తింపు సంఘం (ఏ.ఐ.టి.యు.సి) యూనియన్ తో.. 3వ, స్ట్రక్చర్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. సింగరేణి కార్మికుల పలు సమస్యలపై జి.ఎం జి.దేవేందర్ అధ్యక్షతన మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని, కాన్ఫరెన్స్ హాల్ నందు తేదీ: 30.01.2025, నాడు గుర్తింపు కార్మిక సంఘం (ఏ.ఐ.టి.యు.సి) మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, ఏఐటి యుసి నాయకులతో నిర్మాణాత్మక సమీక్షా సమావేశం జరిగింది.ఈ సమావేశం లో.. జి.ఎం జి.దేవేందర్ గుర్తింపు సంఘం నాయకులతో మాట్లాడుతూ... సంస్థ అభివృద్ధిలో ఉత్పత్తి, ఉత్పాదకత లో కార్మిక సంఘాల పాత్ర చాలా కీలకమైనది అని, సింగరేణి సంస్థ ఉత్పత్తి మరియు ఉత్పాదకత లోనే కాకుండా.. ఉద్యోగుల సంక్షేమానికి కూడా ఎక్కువ ప్రదాన్యతను ఇస్తుంది అని తెలిపారు. ఈ సమావేశంలో కాసిపేట-2 ఇంక్లైన్ లో ఫ్యాన్ ఆపరేటర్, మేగజైన్ రూం నిర్మాణం, మ్యాగజైన్ రూమ్ కి కంప్యూటర్, కాసిపేట-1 ఇంక్లైన్ కి సంబంధించి స్కావెంజర్ పోస్టింగ్, కాసిపేట-1%%2 కి సంబంధించి ఓపెన్ రెస్ట్ హాల్ నిర్మించాలని, కె.కె.ఒ.సి కి సంబంధించి ఫర్నిచర్, లాకర్




సౌకర్యం కల్పించాలని, సోమ గూడెంలోని భరత్ కాలనీలో కొత్త డ్రైనేజీ పైప్ లైన్ మరియు వాటర్ పైప్ లైన్, సరిపడా.. స్ట్రీట్ లైట్లను కల్పించాలని, రామకృష్ణాపూర్ స్టేషన్ రోడ్ లో గల కమ్యూనిటీ హాల్ లో కుకింగ్, డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా జి.ఎం జి.దేవేందర్ మాట్లాడుతూ... గుర్తింపు సంఘం నాయకులు ప్రస్తావించిన పనులను పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఇప్పటి వరకు ఏవిధముగా ఉత్పత్తి లక్ష్య సాధనలో సహకరించారో ఇక ముందు కూడా సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం విజయ ప్రసాద్,మందమర్రి ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, ఏరియ సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఏరియా ఇంజనీర్ వెంకటరమణ (ఇ % ఎం), కే.కే ఓ.సి ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య,కే.కే గ్రూప్ ఏజెంట్ రామదాసు,డీ.జీ.ఎం. ఐ.ఇ.డి రాజన్న, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసు ందర్, సురేష్ (డి.వై.జి.ఎం, ఇ%ఎం),డి.వై పి.ఎం మైత్రేయ బందు, కృష్ణారెడ్డి (ఎస్.ఇ, ఇ%ఎం), సివిల్ ఎస్.ఈ రాము, ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, బెల్లంపల్లి ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, సుదర్శన్ (స్ట్రక్చర్ కమిటీ మెంబర్),సి.వి.రమణ (స్ట్రక్చర్ కమిటీ మెంబర్) పాల్గొన్నారు.

# మా గోడు వినండి

**హైదరాబాద్ :** హైదరాబాద్ లోని గాంధీభవన్ లో నిర్వహించిన మంత్రులతో ముఖాముఖి కార్యక్రమానికి వచ్చిన మరుగుజ్జు దంపతులు ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్ గా మారారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసిన ఈ జంట.. తమ బాధలను వెల్లబోసుకున్నారు. ఫుట్ పాత్ పై ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకుని జీవనం సాగించే ఈ దంపతులు.. తమకు ఉండడానికి ఇల్లు లేదని, రేషన్ కార్డ్ కూడా లేదని వాపోయారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎలాంటి ఫలితం లేదని వాపోయారు. ఇద్దరు పిల్లలతో వచ్చిన ఈ మరుగుజ్జు దంపతులు అనేక బాధలు పడుతూ నగరంలో కాలం వెల్లబోస్తున్నారు. ఇంటి అద్దె కట్టలేక నానా అవస్థలు పడుతున్నారు. సర్కారు ఆఫీసుల చుట్టూ తిరిగి, తిరిగి అలసిపోయిన ఈ మరుగుజ్జు దంపతులు.. ఇప్పుడు మంత్రులతో ముఖాముఖి తలుపు తట్టారు.మలక్ పేట నుంచి ఇద్దరు పిల్లలతో కలిసి వచ్చిన మరుగుజ్జు దంపతులు మంత్రులతో ముఖాముఖి కార్యక్రమానికి వచ్చి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిశారు. ఉండడానికి ఇల్లు లేదని, రేషన్ కార్డ్ లేదని ఆయనకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఈ జంట.. ఫుట్ పాత్ పై ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకుని జీవనం సాగిస్తున్నామని చెప్పారు.



అంతకుముందు ప్రజాపాలనలోనూ రేషన్ కార్డ్, ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నా.. తమకు మంజూరు కాలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పట్నుంచి తాము ఆఫీసులు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరుగుతున్నామన్నారు. వారి ఇద్దరు పిల్లలు సైతం అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారంలో రోజూ కేవలం రూ.200 మాత్రమే వస్తాయని, నెలకు ఇంటి అద్దె రూ.8వేలు కడుతున్నామన్నారు. తమ పరిస్థితిని చూసి ప్రభుత్వమే తమకు సహాయమందించాలని, ఆదుకోవాలని కోరారు.ప్రజల సమస్యలతో పాటు పార్టీ కేడర్ ఇబ్బందులను నేరుగా తెలుసుకుని వాటిని అప్పటికప్పుడు పరిష్కారించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన కార్యక్రమమే మంత్రులతో ముఖాముఖి. పీసీసీ చీఫ్ గా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించిన కేవలం వారం రోజుల్లోనే అంటే గతేడాది సెప్టెంబర్ చివరి వారంలో ఈ ప్రోగ్రామ్ ను ప్రారంభించారు. అందరికీ అందుబాటులో ఉండేలా వారంలో 2 సార్లు అంటే బుధ, శుక్రవారాల్లో గాంధీ భవన్ లో ఈ కార్యక్రమం నిర్వహించాలని పీసీసీ చీఫ్ నిర్ణయించారు. అలా ఒక్కో రోజు ఒక్కో మంత్రి పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. సీఎం కూడా నెలలో 2సార్లు హాజరు కావాలని కోరారు. అలా ఈ కార్యక్రమం 3 వారాల పాటు సజావుగా సాగింది. మొదట్లో దరఖాస్తులను నేరుగా మంత్రులే తీసుకుని అప్పటికప్పుడు పరిష్కరించగా, మరికొన్ని మాత్రం అధికారులకు సిఫార్సు చేసి ఆదేశాలు జారీ చేశారు. ఆ తర్వాత వారంలో 2 సార్లకు బదులు 15 రోజులకు 2 సార్లు నిర్వహించడం మొదలు పెట్టారు. ఇలా 3 నెలల పాటు సాగింది. ఈ కార్యక్రమాన్ని చివరిసారిగా డిసెంబర్ 5, 2024లో నిర్వహించగా.. ఇందులో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖాముఖిలో పాల్గొన్నారు. అప్పట్నుంచి నెలన్నర తర్వాత మళ్లీ జనవరి 29న మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించడం గమనార్హం.

# ఫోన్ ట్యాపింగ్ అందరూ బయటకు వచ్చేశారే

**హైదరాబాద్ :** తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు తీవ్ర కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో పలువురు పోలీసు అధికారులు అరెస్టయ్యారు. ఈ కేసులో తాజాగా హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. నిందితులుగా ఉన్న సిటీ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్, మూడో నిందితుడుగా ఉన్న భుజంగరావుకు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా హైకోర్టు నిందితులు లక్ష రూపాయలతో రెండు ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశించింది. అదేవిధంగా పాస్పోర్టులు సమర్పించాలని సూచించింది. ట్యాపింగ్ కేసులో విచారణకు సహకరించాలని ఆదేశించింది హైకోర్టు ధర్మాసనం. తాజాగా రాధాకిషన్, భుజంగరావుకు బెయిల్ మంజూరు చేయడంతో ఈ కేసులో ఉన్న ప్రణీత్ రావు మత్రమే ప్రస్తుతం జైలులో ఉన్నారు. మిగతా నిందితులందరికీ బెయిలు మంజూరైంది. ఈ కేసులో సస్పెండైన అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు సుప్రీంకోర్టు ఈ నెల 28న బెయిల్ మంజూరు చేసింది. చంచల్‌గూడ జైలు నుంచి బయటకు వచ్చారు. ఈ కేసులో 4వ నిందితుడిగా ఉన్న తిరుపతన్నను గతేడాది మార్చి 23న సిట్ అరెస్ట్ చేసింది. దీంతో 10 నెలలపాటు జైలు జీవితం గడిపిన తిరుపతన్న బెయిల్పై విడుదలయ్యారు. ఆయనకు రెగ్యులర్ బెయిల్ లభించి విడుదల కావడం గమనార్హం. సుప్రీం ఆదేశాల మేరకు ఆయన లాయర్లు మంగళవారం నాంపల్లి కోర్టులో ష్యూరిటీస్ దాఖలు చేశారు. అనంతరం బెయిల్ ఆర్డర్‌ను చంచల్‌గూడ జైలు అధికారులకు అందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ప్రధా నిందితుడు మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుకు మాత్రం బెయిల్ లభించలేదు. రెండో నిందితుడిగా ఉన్న ప్రణీత్‌రావు ప్రస్తుతం చంచల్గూడ జైలులోనే ఉన్నారు. ఆయన తరఫు లాయర్లు సమర్పించిన బెయిల్ పిటిషన్లను హైకోర్టు పలుమార్లు తిరస్కరించింది.ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఆరో నిందితుడిగా ఉన్న ఐ న్యూస్ మాజీ ఎండీ శ్రవణ్‌రావు అమెరికాలో అక్రమంగా




నివాసం ఉంటున్నారు. ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావును ఇండియాకు రప్పించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో పాటు హైదరాబాద్‌లోని అమెరికన్ ఎంబసీ ద్వారా అమెరికా ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో రెండో చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు సిట్ దర్యాప్తు చేయగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2023 నవంబర్ 15 నుంచి 30వ తేదీ మధ్య 450కి పైగా ఫోన్లను ట్యాప్ చేసినట్టు సిట్ సాంకేతిక ఆధారాలు సేకరించింది. ఇందులో త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి వినియోగించిన రెండు ఫోన్ నంబర్స్‌తో పాటు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రధాన అనుచరుల ఫోన్ నంబర్స్, మండలస్థాయి కాంగ్రెస్ లీడర్ల నంబర్లు కూడా ఉన్నట్టు గుర్తించారు. ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు ఇటీవలే వెల్లడైంది. వీరిలో ఒక మహిళా న్యాయమూర్తి కూడా ఉన్నారు. ప్రభాకర్‌రావు నేతృత్వంలోని ముఠాలోని కీలక నిందితుడి సెల్‌ఫోన్‌ను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) విశ్లేషించగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుల ఫోన్లలో ఇద్దరు న్యాయమూర్తుల ఫొటోలతో పాటు వారి పూర్తి ప్రొఫైల్స్ ఉన్నాయి. వారు ఎక్కడ జన్మించారు? ఎక్కడ చదువుకున్నారు? కుటుంబ సభ్యుల వివరాలు, ఉద్యోగ ప్రస్థానం వంటి విషయాలు కూడా అందులో ఉన్నాయి. వారి నంబర్ల కాల్ డిటైల్ రికార్డ్స్ (సీడీఆర్)తో పాటు ఇంటర్నెట్ ప్రోటోకాల్ డిటైల్ రికార్డ్స్ (ఐపీడీఆర్)ను కూడా నిందితుడు సేకరించినట్లు గుర్తించారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com